ప్రజాశక్తి
గురువారం 1 ఫిబ్రవరి 2024 8 పేజీలు
ప్రకాశం బాపట్ల

36 మంది తహశీల్దార్లు బదిలీ

ఉత్తర్వులు జారీ చేసిన ప్రభుత్వం

ప్రజాశక్తి-ఒంగోలు కలెక్టరేట్

రానున్న సార్వత్రిక ఎన్నికలను దృష్టిలో ఉంచుకొని ప్రకాశం జిల్లాలోని 36 మంది తహశీల్దార్లను గుంటూరు, శ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లాలకు బదిలీ చేస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఉమ్మడి ప్రకాశం జిల్లాలో ఆరుగురు తహశీల్దార్లు ఈ ఏడాది జూన్ నాటికి ఉద్యోగ విరమణ చేయనుండటంతో వారిని ప్రస్తుతం ఉన్న స్థానాలలో ఉంచుతూ ఎన్నికల విధులలో పాల్గొనకుండా చూడాలని కలెక్టర్లకు ఆదేశాలు జారీ చేసింది. బదిలీ అయిన తహశీల్దార్లలో సూపరింటెండెంట్స్ టి.రవి, ఎస్ఎల్.నారాయణరెడ్డి, ఎస్.వెంకటేశ్వర్లు, కెఎస్ఆర్ కృష్ణారావు, బి.జయవర్ధన్, చీమకుర్తి తహశీల్దార్ పి.మధుసూదనరావు, జరుగుమల్లి తహశీల్దార్ ఎస్.ఉషారాణి, కొండపి తహశీల్దార్ పి.సింగారావు, కొత్తపట్నం తహశీల్దార్ బివి రమణారావు, ముండ్లమూరు తహశీల్దార్ ఎమ్‌డి నయీమ్, మద్దిపాడు తహశీల్దార్ జి.రజనీకుమారి, శింగరాయకొండ తహశీల్దార్ సిహెచ్ ఉష గుంటూరు జిల్లాకు బదిలీ అయ్యారు. టంగుటూరు తహశీల్దార్ కె.సంజీవరావు శ్రీపొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లాకు బదిలీ అయ్యారు. దర్శి తహశీల్దార్ కె.వెంకటేశ్వరరావు, దొనకొండ తహశీల్దార్ ఎం.సువర్ణ, హెచ్ఎంపాడు తహశీల్దార్ వి.పుల్లారావు, కనిగిరి తహశీల్దార్ ఎల్.లక్ష్మీనారాయణ, కురిచేడు తహశీల్దార్ ఎం.జ్వాలా నరసింహం, మర్రిపూడి తహశీల్దార్ ఎం.హరిబాబు, పిసిపల్లి తహశీల్దార్ కె.ప్రవీణ్ కుమార్, పొదిలి తహశీల్దార్ సిహెచ్ అశోక్ కుమార్ రెడ్డి, పొన్నలూరు తహశీల్దార్ ఎం.శ్రావణ్‌కుమార్, గుంటూరు జిల్లాకు బదిలీ అయ్యారు. వెలిగండ్ల తహశీల్దార్ ఎన్.వాసు శ్రీ పొట్టిశ్రీరాములు నెల్లూరు జిల్లాకు బదిలీ అయ్యారు. బేస్తవారిపేట తహశీల్దార్ డివిబి వర కుమార్ గుంటూరు జిల్లాకు, కంభం తహశీల్దార్ పి.శైలేంద్రకుమార్, నెల్లూరు జిల్లాకు బదిలీ అయ్యారు. గిద్దలూరు తహశీల్దార్ డి.సీతారామయ్య గుంటూరు జిల్లాకు, కొమరోలు తహశీల్దార్ బి.రమాదేవి నెల్లూరు జిల్లాకు బదిలీ అయ్యారు. మార్కాపురం తహశీల్దార్ డి.మధుసూదనరెడ్డి గుంటూరు జిల్లాకు, పెద్దారవీడు తహశీల్దార్ ఎంవి కృష్ణారెడ్డి, నెల్లూరు జిల్లాకు బదిలీ అయ్యారు. త్రిపురాంతకం తహశీల్దార్ వి.కిరణ్, యర్రగొండపాలెం తహశీల్దార్ కె.రవీంద్ర రెడ్డి, రాచర్ల తహశీల్దార్ బి.దిలీప్ కుమార్, చీరాల తహశీల్దార్ జె.ప్రభాకరరావు, గుంటూరు జిల్లాకు, కారంచేడు తహశీల్దార్ ఎస్.వెంకటరత్నం నెల్లూరు జిల్లాకు బదిలీ అయ్యారు. ఇంకొల్లు తహశీల్దార్ పి.బ్రహ్మయ్య, ▶ 2లో

రీజినల్ కోఆర్డినేటర్‌గా చెవిరెడ్డి

- బాలినేని అభ్యంతరాలను బేఖాతరు చేసిన వైసిపి అధిష్టానం
- ఎవరికీ పట్టకపోతే తనకెందుకంటూ మాజీ మంత్రి వ్యాఖ్య
- చెవిరెడ్డిని కోఆర్డినేటర్‌గా ప్రకటించడంతో తీవ్ర అసహనంతో హైదరాబాద్ వెళ్లిపోయిన బాలినేని
- ఐదో జాబితాలోనూ కనిపించని గిద్దలూరు, మార్కాపురం

ప్రజాశక్తి-ఒంగోలు బ్యూరో

సిఎం జగన్ ఆయన అనుకున్నదే చేశారు. విధేయులుగా గుర్తించబడిన వారినే అందలం ఎక్కిస్తున్నారు. ఎవరి అభ్యంతరాలను ఖాతరు చేసే పరిస్థితి కనిపించడం లేదు. ఒంగోలు పార్లమెంటుతో పాటు కందుకూరు, కావలి, సంతనూతలపాడు నియోజకవర్గాలకు రీజనల్ కోఆర్డినేటర్‌గా చెవిరెడ్డి భాస్కరరెడ్డిని నియమిస్తూ పార్టీ బుధవారం నాడు నిర్ణయం తీసుకుంది. ఆయన నియామకాన్ని పార్టీ కార్యాలయం నుంచి ప్రకటన వెలువడింది. సిట్టింగు ఎంపీ మాగుంటకు ముందే

సిఎం జగన్‌తో చెవిరెడ్డి (ఫైల్)

చెప్పినట్లుగా టిక్కెట్టు లేదని స్పష్టమైంది. పార్టీ రీజినల్ కో ఆర్డినేటర్‌గా చెవిరెడ్డి బాస్కరరెడ్డిని పెట్టాలనే నిర్ణయాన్ని మాజీ మంత్రి బాలినేనికి అధిష్టానం పెద్దలు విజయసాయిరెడ్డి, సజ్జల రామకృష్ణారెడ్డి వివరించిన సంగతి తెలిసిందే. చెవిరెడ్డికి కీలక పదవులు అప్పగించడాన్ని బాలినేని తీవ్రంగా వ్యతిరేకించారు. ఎట్టి పరిస్థితుల్లో అతని కింద పనిచేయబోమని స్పష్టం చేశారు. దీనిపై మాట్లాడేందుకు, సిఎం జగన్‌ను కలిసేందుకు కూడా బాలినేని సిద్ధంగా లేనందున ఆ విషయాన్ని కూడా సిఎం దృష్టికి తీసుకుపోయారు. బాలినేని మాత్రం మాగుంటకే టిక్కెట్టు ఇవ్వాలనే పట్టుదలతోనే ఉన్నారు. దీనిపై ఇంకా ఉత్కంఠ కొనసాగుతోంది. అయితే కోఆర్డినేటర్ నియామకాన్ని తాత్కాలికంగా నిలిపేసినట్లు బాలినేనికి పార్టీ పెద్దలు తెలిపారు. దీంతో ఆయన బుధవారం నాడు ఒంగోలు వచ్చారు. సాయంత్రానికి పార్టీ కార్యాలయం నుంచి ప్రకటన రావడం చర్చగా మారింది. బాలినేని తీవ్రంగా వ్యతిరేకించినా అధిష్టానం ఏమాత్రం పట్టించుకోకపోవడంపైనే చర్చ సాగుతోంది. దీనిపై బాలినేని ఎలాంటి నిర్ణయం తీసుకుంటారనేదీ చూడాల్సి ఉంది. విజయవాడ నుంచి వచ్చాక ఆయన మీడియాతో మాట్లాడుతూ తీవ్ర అసహనం అసంతృప్తి వ్యక్తం చేశారు. అందరూ పట్టించుకోనప్పుడు తనకు ఎందుకనే భావనకు వచ్చేశారు. అధిష్టానం తన అభిప్రాయాలను ఏమాత్రం పరిగణలోకి తీసుకోవడం లేదనే అంచనాకు వచ్చారు. సర్దుకుపోవడమా? సమరమా?అనేది ఇపుడు తేలాల్సి ఉంది.

నా నియోజకవర్గానికే పరిమితమవుతా..

ఒంగోలు వచ్చిన బాలినేని తనను కలిసిన మీడియాతో మాట్లాడుతూ..అందరికీ మేలు జరుగుతుందని మాగుంటను ఎంపీగా పెట్టాలని చూశానన్నారు. ఇప్పుడు ▶ 2లో

మాట్లాడుతున్న కలెక్టర్ దినేష్‌కుమార్

క్రీడాస్ఫూర్తిని పెంపొందించేందుకు కృషి: కలెక్టర్

8లో ▶

రూ. 3 లక్షల చెక్కు అందజేస్తున్న భువనేశ్వరి

పేదవాళ్లు బాగుండాలంటే టిడిపి ప్రభుత్వం రావాలి

నారా భువనేశ్వరి

5లో ▶

ఆర్థిక బకాయిలు వెంటనే చెల్లించండి..

- యుటిఎఫ్ రాష్ట్ర గౌరవాధ్యక్షులు కె.శ్రీనివాసరావు
- ఒంగోలు కలెక్టరేట్ వద్ద రిలే దీక్షలు ప్రారంభం

రిలే దీక్షల్లో యుటిఎఫ్ నాయకులు, ఉపాధ్యాయులు

ప్రజాశక్తి - ఒంగోలు కలెక్టరేట్

ఉద్యోగ, ఉపాధ్యాయులకు ఇవ్వాల్సిన ఆర్థిక బకాయిలను వెంటనే చెల్లించాలని యుటిఎఫ్ రాష్ట్ర గౌరవాధ్యక్షులు కె.శ్రీనివాసరావు డిమాండ్ చేశారు. పెండింగ్‌లో ఉన్న పిఎఫ్, డిఏ, పిఆర్‌సి, సరెండర్ లీవు బకాయిలు, మొత్తం 18 వేల కోట్ల రూపాయలు వెంటనే చెల్లించాలని, మునిసిపల్ ఉపాధ్యాయుల పదోన్నతులు, బదిలీలు, సర్వీస్ రూల్స్ వెంటనే ప్రకటించాలని, జిపిఎస్‌ను రద్దుచేసి పాత పెన్షన్ విధానాన్ని అమలు చేయాలని కోరుతూ ఆంధ్రప్రదేశ్ ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ రాష్ట్ర వ్యాప్త పిలుపులో భాగంగా బుధవారం ఒంగోలు కలెక్టరేట్ వద్ద రిలే నిరాహార దీక్షలు ప్రారంభమయ్యాయి. కార్యక్రమానికి యుటిఎఫ్ జిల్లా అధ్యక్షులు ఓవి.వీరారెడ్డి అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా యుటిఎఫ్ రాష్ట్ర గౌరవాధ్యక్షులు కె.శ్రీనివాసరావు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం వెంటనే స్పందించి ఉపాధ్యాయుల ఆర్థిక బకాయిలు వెంటనే చెల్లించాలని డిమాండ్ చేశారు, తమ సమస్యలు పరిష్కారమయ్యేంత వరకు దీక్షలను కొనసాగిస్తామని తెలియజేశారు. రిలే నిరాహార దీక్షలకు సంఘీభావం తెలిపిన సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు జివి కొండారెడ్డి మాట్లాడుతూ రాష్ట్ర ఆర్థిక పరిస్థితి సంక్షోభంలోకి వెళ్లిందని, ఉద్యోగ, ఉపాధ్యాయులకు నెలలో ఒకటో తేదీన జీతాలు ఇవ్వలేని దుస్థితిలోకి వెళ్లిందని విమర్శించారు. ఉపాధ్యాయుల ఆర్థిక బకాయిలను వెంటనే చెల్లించాలని, మున్సిపల్ ఉపాధ్యాయుల పదోన్నతులు, బదిలీ, సర్వీస్ రూల్స్ ప్రకటించాలన్నారు. ఉపాధ్యాయులు వారి సమస్యలను ప్రభుత్వం పరిష్కరించే వరకు ▶ 2లో

25 వేల డీఎస్సీ పోస్టులివ్వాలి..

డివైఎఫ్ఐ రాష్ట్ర కార్యదర్శి జి.రామన్న

ప్రజాశక్తి-చీరాల

మాట్లాడుతున్న డివైఎఫ్ఐ రాష్ట్ర కార్యదర్శి జి.రామన్న

రాష్ట్ర ప్రభుత్వం ఇప్పటికైనా నిరుద్యోగులను దష్టిలో ఉంచుకొని 25 వేల పోస్టుల భర్తీకి నోటిఫికేషన్ విడుదల చేయాలని డివైఎఫ్ఐ రాష్ట్ర కార్యదర్శి గుమ్మల రామన్న డిమాండ్ చేశారు. కేవలం 6100 పోస్టుల భర్తీకి మాత్రమే రాష్ట్ర కేబినెట్ ఆమోదం తెలపటం సరికాదన్నారు. బుధవారం స్థానిక లూథరన్ కళాశాలలో ప్రజాసంఘాలు మరియు కళాశాల నిర్వాహకులు గ్రూప్-2 అభ్యర్థులకు స్వచ్ఛందంగా నిర్వహిస్తున్న ఉచిత కోచింగ్ శిక్షణ కార్యక్రమానికి హాజరై.. అభ్యర్థులకు అవగాహన కల్పించారు. అనంతరం జరిగిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. రాష్ట్రంలో లక్షకు పైగా పోస్టులు భర్తీ చేయాల్సి ఉందని, ఉద్యోగాలను భర్తీ చేయకుండా రాష్ట్రవ్యాప్తంగా అనేక పాఠశాలలను ప్రభుత్వం మూసేసిందన్నారు. డివైఎఫ్ఐ చీరాల ప్రాంతీయ కార్యదర్శి పి సాయిరాం అధ్యక్షతన జరిగిన విలేకరుల సమావేశంలో డివైఎఫ్ఐ నాయకులు భగవాన్ దాస్ పాల్గొన్నారు.

ఆర్థిక బకాయిలు వెంటనే చెల్లించాలి

(మొదటిపేజీ తరువాయి)

పోరాటాన్ని కొనసాగించాలన్నారు. దీక్షలలో పాల్గొన్న ఆల్ పెన్షనర్స్ అసోసియేషన్ జిల్లా నాయకులు జి.శేషయ్య పాల్గొని ప్రసంగించారు. రిలే నిరాహార దీక్షలలో యుటిఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి డి వీరాంజనేయులు, యుటిఎఫ్ జిల్లా గౌరవాధ్యక్షులు ఎస్ రవి, సహాధ్యక్షులు ఎస్.కె అబ్దుల్ హై, కోశాధికారి ఎన్ చిన్నస్వామి, పరిసర మండలాల బాధ్యులు జయరాజు, నాగమల్లేశ్వరరావు, వెంకటేశ్వర్లు, ఎన్ నారాయణ, కోటేశ్వరరావు, అక్బర్, శ్రీనివాసరావు, జిల్లా కార్యదర్శి వెంకయ్య, యుటిఎఫ్ కార్యకర్తలు పాల్గొన్నారు.

36 మంది తహశీల్దార్లు బదిలీ

(మొదటిపేజీ తరువాయి)

చిన్నగంజాం తహశీల్దార్ పి.పార్వతి, బల్లికురవ తహశీల్దార్ కె.రవిబాబు గుంటూరు జిల్లాకు బదిలీ అయ్యారు. అద్దంకి తహశీల్దార్ జివి సుబ్బారెడ్డి నెల్లూరు జిల్లాకు, ఉలపపాడు తహశల్దార్ ఆర్.బ్రహ్మయ్య, డిఏఒ టి.శ్రీనివాసులు గుంటూరు జిల్లాకు బదిలీ అయ్యారు.

రీజినల్ కోఆర్డినేటర్‌గా చెవిరెడ్డి

(మొదటిపేజీ తరువాయి)

ఎవరికీ పట్టకపోతే తనకెందుకన్నారు. మిగతా ఇన్‌ఛార్జులు ఎవరూ మాట్లాడటం లేదన్నారు. తానూ తన నియోజకవర్గానికే పరిమితమవుతానని చెప్పారు. అధిష్టానం ఏది చెబితే దాన్ని అనుసరిస్తామని కూడా చెప్పడం గమనార్హం. వాస్తవానికి మాగుంట విషయంలో బాలినేని ఒక్కరే ఓపెన్‌గా మాట్లాడుతున్నారు. మంత్రులు ఇద్దరు గానీ, మిగతా ఇన్‌ఛార్జిలు గానీ మాట్లాడే పరిస్థితి కనిపించలేదు. అధిష్టానం నిర్ణయం ఏమిటో తెలిశాక బాలినేని మాదిరిగా సిఎం జగన్‌పై పోరాటం చేసే పరిస్థితి కూడా ఎవరిలో కనిపించడం లేదు. ఒంగోలు పార్లమెంట్‌కు రీజినల్ కో ఆర్డినేటర్‌గా చెవిరెడ్డి పేరును పార్టీ బుధవారం రాత్రి ప్రకటించడంతో తీవ్ర అసహనానికి గురైన బాలినేని హైదరాబాద్‌కు వెళ్లిపోయారు.

ఎటూ తేలని గిద్దలూరు, మార్కాపురం అభ్యర్థులు

బుధవారం రాత్రి విడుదలైన ఐదో జాబితాలో గిద్దలూరు, మార్కాపురం అభ్యర్థుల పేర్లు రాలేదు. ఇది కూడా చర్చగా మారింది. జిల్లాలో ఏం జరుగుతోందనే దానికి ఇదే అద్దం పడుతోంది. గిద్దలూరులో ఎవరిని పెట్టాలనే దానిపై ఇంకా ఓ నిర్ణయానికి రాలేదు. బలమైన నేతలు అక్కడ కనిపించడం లేదు. మరోవైపు పోటీ నుంచి తప్పుకున్న ఎమ్మెల్యే అన్నా రాంబాబు కోసం ఆయన అనుచరులు మళ్లీ ప్రయత్నాలు మొదలు పెట్టారు. సమావేశాలు పెట్టి టిక్కెట్టు ఇవ్వాలని కోరుతున్నారు. అధిష్టానం ఈయన విషయం ఏమైనా ఆలోచిస్తుందా? లేక కొత్తవారికి అవకాశం కల్పిస్తుందా? అన్నదీ తేలాలి. ఇక మార్కాపురం టిక్కెట్టుపై కొంత స్పష్టత ఉంది. సిట్టింగు ఎమ్మెల్యే నాగార్జునరెడ్డికే ఖరారైనట్లు చెబుతున్నా జాబితాలో రాలేదు. ఏదేమైనా జిల్లాలో వైసిపిలో జరుగుతోన్న పరిణామాలు ముఖ్యనేతల భవితవ్యానికే ఆందోళనగా మారాయి.

బోరు ఏర్పాటుకు చర్యలు

ప్రజాశక్తి-దొనకొండ

బోరు వేస్తున్న దృశ్యం

స్థానిక నాలుగు రోడ్ల కూడలిలోని ఆనంద ఆశ్రమానికి గురువారం దర్శి మాజీ ఎమ్మెల్యే డాక్టర్ బూచేపల్లి శివప్రసాద్‌రెడ్డి బోరు ఏర్పాటుకు చర్యలు చేపట్టారు. ఆశ్రమంలోని బోరు అడుగంటడంతో ఇటీవల ఆశ్రమంలోని దేవాలయాలకు వచ్చే భక్తులకు, గోశాలలోని గోవులకు తాగునీటి సమస్య తలెత్తిందని ధర్మకర్త భైరవానందస్వామి బూచేపల్లి శివప్రసాద్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లారు. స్పందించిన ఆయన ఆశ్రమానికి వెంటనే బోరుబండి పంపి బోరు వేయించే పనులు మొదలుపెట్టారు. దీంతోపాటు అవసరమైన విద్యుత్ మోటారు, గోవులకు ఒక లారీ వరిగడ్డి పంపించారు. అడిగిన వెంటనే స్పందించి ఆశ్రమ ఇబ్బంది పరిష్కరించిన బూచేపల్లి శివప్రసాద్‌రెడ్డికి ధర్మకర్త భైరవానందస్వామి కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ బొరిగొర్ల ఉషారాణి, మండల వైసీపీ మాజీ కన్వీనర్ కాకర్ల కృష్ణారెడ్డి, నాయకులు కర్నాటి ఆంజనేయరెడ్డి, మంగిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

అధ్వాన రహదారితో అగచాట్లు

బస్సు నిలిపివేతతో ఇబ్బందులు పడుతున్న విద్యార్థులు ● నాలుగు కిలోమీటర్లు నడిస్తేనే చదువు సంధ్యలు

ప్రజాశక్తి-యర్రగొండపాలెం

యర్రగొండపాలెం మండలంలోని చెన్నరాయునిపల్లె, చిన్న కొలుకుల గ్రామాల విద్యార్థులు చదువుకోవడానికి అష్టకష్టాలు పడుతున్నారు. ప్రతిరోజూ ఆ గ్రామాల నుంచి నాలుగు కిలోమీటర్ల దూరంలోని ప్రభుత్వ పాఠశాలకు కాలినడకనే వెళ్లాల్సి వస్తోంది. పాఠశాల ముగిశాక తిరిగి ఇంటికి కూడా నడక తప్పడం లేదు. గత అయిదేళ్లుగా ఇదే తంతు కొనసాగుతోంది. మండలంలోని కొలుకుల, గుర్రపుశాల ప్రధాన రహదారిలో గుంతలు ఏర్పడి అధ్వానంగా మారడంతో వాహనాల రాకపోకలు సాగడం లేదు. అదే మార్గంలో ఉండే చెన్నరాయునిపల్లె, చిన్న కొలుకుల గ్రామాలకు చెందిన సుమారు 40 మంది విద్యార్థులు కొలుకుల గ్రామంలోని జిల్లా పరిషత్ పాఠశాలలో చదువులు కొనసాగిస్తున్నారు. ఈ పాఠశాల నుంచి ఆయా గ్రామాలు దాదాపు నాలుగు కిలోమీటర్ల దూరంలో ఉన్నాయి. గతంలో మార్కాపురం డిపోకు చెందిన ఆర్టీసీ బస్సు ఈ దారిలో రాకపోకలు సాగించేది. దీంతో గ్రామస్థులకు, విద్యార్థులకు ఎటువంటి ఇబ్బందులు తలెత్తలేదు. ఇటీవల కొలుకుల ప్రధాన రహదారి అధ్వానంగా మారడంలో అధికారులు బస్సు సర్వీసును నిలిపేశారు. దీంతో విద్యార్థుల కష్టాలు మళ్లీ మొదలయ్యాయి. ప్రస్తుత ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక రహదారి మరమ్మతులను, విద్యార్థుల కష్టాలను పట్టించుకోలేదన్న ఆరోపణలు బలంగా ఉన్నాయి. ఈ దారి

అధ్వానంగా ఉన్న రహదారి

సరిగా లేకపోవడంతో ఆటోలు సైతం తిరగడం లేదు.

ప్రజలకు తప్పని తిప్పలు

కొలుకుల పంచాయతీలో ఉన్న చెన్నరాయునిపల్లి, చిన్న కొలుకుల గ్రామాల ప్రజలు సైతం రహదారి బాగోలేక ఇటు యర్రగొండపాలెం పోవాలన్నా, అటు మార్కాపురం వెళ్లాలన్నా ఇబ్బందులు పడుతున్నారు. గతంలో మార్కాపురం నుంచి గుర్రపుశాల మీదుగా కొలుకులకు బస్సు సర్వీసు ఉండేది. రోడ్డు అధ్వానంగా మారడంతో బస్సును గుర్రపుశాల వరకు మాత్రమే పరిమితం చేశారు. దీంతో మార్కాపురం వెళ్లాలంటే ఆ గ్రామాల నుంచి అయిదు కిలోమీటర్ల దూరంలో ఉన్న గుర్రపుశాలకు నడిచి వెళ్లాలి. అక్కడ బస్సు ఎక్కి ప్రయాణం సాగించాల్సిన పరిస్థితి నెలకొంది. లేకుంటే నాలుగు కిలోమీటర్ల దూరంలో ఉన్న

అధ్వాన రహదారిలో పాఠశాలకు నడిచి వెళుతున్న విద్యార్థులు

కొలుకుల గ్రామానికి చేరుకుని అక్కడ నుంచి ఆటోలో యర్రగొండపాలెం చేరుకుని మార్కాపురం వెళ్లి వస్తుంటారు. ప్రస్తుతం కొలుకుల, చిన్నకొలుకుల, చెన్నరాయునిపల్లె గ్రామస్థులు ఆటోల ద్వారా యర్రగొండపాలెం వచ్చి ఇతర ప్రాంతాలకు ప్రయాణం సాగిస్తున్నారు. విద్యార్థులు మాత్రం ఇప్పటికీ కాలినడకనే వెళుతున్నారు. కొంతమంది చదువులు మానేసిన సందర్భాలు ఉన్నాయి. ఇప్పటికైనా కొలుకుల గ్రామానికి ఇరు వైపులా ఉన్న రహదారులను బాగుచేసి ప్రజలకు, విద్యార్థులకు బస్సు సౌకర్యం తిరిగి ఏర్పాటు చేయాలని ఆయా గ్రామాల ప్రజలు కోరుతున్నారు.

తల్లిదండ్రులకు మంచిపేరు తేవాలి

ఘనంగా ప్రభుత్వ జూనియర్ కళాశాల వార్షికోత్సవం

ప్రజాశక్తి-కనిగిరి

స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాల 54వ వార్షికోత్సవం, సీనియర్ విద్యార్థులకు వీడ్కోలు కార్యక్రమం బుధవారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి కళాశాల ప్రిన్సిపాల్ పి రమణారెడ్డి అధ్యక్షత వహించారు. ముఖ్య అతిథులుగా డిగ్రీ కళాశాల తెలుగు అధ్యాపకులు డాక్టర్ బాలకృష్ణ, పామూరు ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ సురేష్, ప్రభుత్వ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు సంజీవ్, జడ్పీ బాలికల ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు విజయలక్ష్మి, రిటైర్డ్ బోటనీ లెక్చరర్ శేషబ్రహ్మం, కళాశాల తల్లిదండ్రుల కమిటీ అధ్యక్షులు నారాయణ పాల్గొని ప్రసంగించారు. విద్యార్థులు

మాట్లాడుతున్న ప్రిన్సిపల్ రమణారెడ్డి

చక్కని అలవాట్లను అలవర్చుకొని ఉన్నత లక్ష్యాలను ఎంచుకొని వాటి సాధనకు కృషి చేయాలని కోరారు. రాబోయే వార్షిక పరీక్షలకు చక్కగా ప్రిపేర్ అయ్యి కళాశాలకు మంచి ఫలితాలు తీసుకువచ్చి అధ్యాపకులకు, తల్లిదండ్రులకు మంచిపేరు తేవాలని అన్నారు. విద్యార్థుల సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. ఈ కార్యక్రమంలో టంగుటూరి గోవిందరావు, కళాశాల లెక్చరర్లు కాశింపీరా, రాజేంద్రబాబు, చెన్నకేశవులు, సురేష్, వెంకటరమణ ఉమా జయశ్రీ, రవీంద్ర, పద్మజా రామరాజు, సురేష్, నాగమణి గురవమ్మ, వెంకటరాజు, కోటి సాహెబ్, కోటేశ్వరరావు, మమత పాల్గొన్నారు.

మధ్యాహ్న భోజన కార్మికుల వినతి

ప్రజాశక్తి-సిఎస్ పురం

మధ్యాహ్న భోజన కార్మికులు తమ సమస్యలు పరిష్కరించాలని ఎంఇఒకు బుధవారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఎన్నికలకు ముందు సిఎం జగన్‌మోహన్‌రెడ్డి ఇచ్చిన హామీలు నెరవేర్చాలని స్థానిక ఎంఇఒ కార్యాలయంలో మధ్యాహ్న భోజన కార్మికులు వినతిపత్రం అందజేశామన్నారు. కనీస వేతనం రూ.10 వేలు ఇవ్వాలని 5వ తేదీ లోపల జీతాలు చెల్లించాలని, మెనూ చార్జీలు రూ.20కి పెంచాలని, గ్యాస్ ఉచితంగా సరఫరా చేయాలని, రెండు జతల యూనిఫాం ఇవ్వాలని, అగ్ని ప్రమాదంలో మరణించిన వారికి నష్టపరిహారం ఇవ్వాలని, ప్రమాద బీమా సౌకర్యం కల్పించాలని, రిటైర్మెంట్ బెనిఫిట్ ఇవ్వాలని, ఉద్యోగ భద్రత కల్పించాలని, గుర్తింపు కార్డులు ఇవ్వాలని, మెటర్నిటీ బెనిఫిట్స్ ఇవ్వాలని, మట్టి ఖర్చులు, దహన సంస్కారాలకు ఇవ్వాలని, వినతిపత్రంలో పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో సిఐటియు గౌరవాధ్యక్షులు ఎస్.తిరుపతిరెడ్డి, సంగిశెట్టి తిరుమలమ్మ, పి రమణమ్మ, సిహెచ్ ప్రసూన, ఎం చిన్నలక్ష్మమ్మ, షేక్ రసూల్, బి జయమ్మ, ఎస్తేరమ్మ తదితరులు పాల్గొన్నారు.

ఎంఆర్‌సిలో వినతిపత్రం అందజేస్తున్న మధ్యాహ్న భోజన కార్మికులు

ఒంగోలు అడిషనల్ సీనియర్ సివిల్ జడ్జి వారి కోర్టులో

O.S.No: 46/2020

కాట్రగడ్డ పద్మావతి .... వాది

వర్సెస్

ఏలూరి సుబ్బారావు వగైరా ....ప్రతివాదులు

నోటీసు

To ,

సూదనగుంట నరసింహారావు,తండ్రి అచ్చయ్య,
డోర్ నెం:43-119-479,
ఆంజనేయ స్వామి బొమ్మ దగ్గర,
ఎం.పీ.పీ స్కూలు ఎదురు,ముక్తినూతలపాడు గ్రామం,
ఒంగోలు మండలం, ప్రకాశం జిల్లా.

పై దావాలో 4వ ప్రతివాది అయిన మీకు ఎన్ని పర్యాయములు దావా సమన్లు పంపిననూ, మీరు ముట్టనందున ఈ ప్రకటన ద్వారా మీకు తెలియజేయునది ఏమనగా తేది:09-02-2024న ఉదయం 10:30కి మీరు స్వయంగా గాని లేదా మీ అడ్వకేట్ గాని కోర్టు వారి ముందు హాజరై మీ ఆక్షేపణలు /స్టేట్ మెంట్లు తెలుపు కొనగలరు/ దాఖలు చేసుకొనగలరు లేనిచో మీపరోక్షమున విచారణ జరిపి దావా తీర్మానించబడునని తెలుసుకోన గలరు

// కోర్టు వారి ఉత్తర్వులతో //

ఒంగోలు
తేది:31-01-2024

ఇట్లు
పత్తిపాటి రామమూర్తి
వాది తరపు అడ్వకేట్
ఒంగోలు

(By Court Order)

దావా సమను

(Or.5 Rule 5 of C.P.C)

మహారాజశ్రీ చీరాల ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి గారి కోర్టులో

OS No.388/2023

Between:-

అమరా వెంకట కిరణ్ ......వాది

మరియు

చిలుకోటి వెంకట లక్ష్మిచంద్రశేఖర్ ...... ప్రతివాది

To,

చిలుకోటి వెంకట లక్ష్మి చంద్రశేఖర్ హిందు,
వయసు 58 సం.లు, వ్యాపారం R/o
ఫ్లాట్ నెం : 105 ఇన్ మార్కండేయ రెసిడెన్సీ
ముత్యాలపేట, పేరాల, చీరాల టౌన్ & మండలం,
బాపట్ల జిల్లా

పై నెంబర్ లోని వాది దావా షెడ్యూల్ దాఖాలా (కరెంట్ మీటరు SC.No. 4411143002589) గల స్థిరాస్తిని తనకు స్వాధీనం చేయమని కోరుతూ ప్రతివాది అయిన మీపై దావా దాఖలు చేసినారు. కావున సదరు దావాలో మీరు హాజరగుటకు ది : 22-02-2024 కి వాయిదా వేసినారు గాన, సదరు తేదీన ఉదయం గం.10-30 ని.లకు మీరు స్వయముగా గాని, మీతరపు అడ్వకేట్ గారి ద్వారా గాని, పైతెల్పిన కోర్టులో హాజరై పై నంబరు దావాలో మీ ఆక్షేపణలు తెలుపుకొనని ఎడల పై నంబరు దావాను మీ పరోక్షమందు విమర్శచేసి తీర్మానించబడునని ఇందుమూలముగా మీకు తెలియ జేయడమైనది.

చీరాల
ది : 31-01-2024

ఇట్లు
వాది తరపు అడ్వకేట్
G.PRADEEP KUMAR
Advocate
M.Tech., LL.B
Muntavari centre,
Chirala-523 155,Bapatla District

కడలూరు సోనా బోట్లు హల్‌చల్

- ఒడ్డుకొచ్చి వేటాడుతున్న వైనం
- తెగిపోతున్న వలలు
- మత్స్యకారుల్లో ఆందోళన
- పట్టించుకోని అధికారులు

ప్రజాశక్తి-సింగరాయకొండ

తమిళనాడు రాష్ట్రంలోని కడలూరు సోనా బోట్ల దాటికి స్థానిక మత్స్యకారులు విలవిల్లాడి పోతున్నారు. కడలూరు సోనా బోట్లు ఇక్కడికి వచ్చి తీరం వెంబడి వేటాడుతున్నాయి. దీంతో స్థానిక మత్స్యకారులకు సంబంధించిన వలలు చినిగి పాడైపోతున్నాయి. మత్స్యకారులు ఆర్థికంగా నష్టపోతున్నారు. గతేడాది కడలూరు బోట్ల అడ్డుకునేందుకు స్థానిక మత్స్యకారులు వివిధ రకాల ప్రయత్నాలు చేశారు. అయినప్పటికీ కడలూరు బోట్లు తీరం వెంబడి సంచరిస్తూ స్థానిక మత్స్యకారులను ఇక్కట్లకు గురిచేస్తున్నాయి. కడలూరు బోట్ల సమస్య గురించి సాక్షాత్ ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డికి వినతిపత్రం ఇచ్చినా ప్రయోజనం లేదని మత్స్యకారులు చెబుతున్నారు. గత వారం రోజులుగా కడలూరు బోట్లు ఇక్కడి వస్తున్నాయి. తీరం వెంబడి చేపల కోసం స్థానిక మత్స్యకారులు వలలను లాక్కొని పోతున్నారు. దీంతో సుమారు నాలుగు లక్షల మేర నష్టం వాటినట్లు మత్స్యకారులు వాపోతున్నారు. వాయిల రాముడు, కాటం గారి గణేష్, ప్రళయ కావేరి నాగరాజు, వాయిల పెంచలయ్య చేపల కోసం తీరంలో వలలు వేశారు. కడలూరు బోట్లు ఒడ్డుకు వచ్చి ఆవలల్లో పడిన చేపలను దోచుకొనేందుకు ప్రయత్నించారు. అందులో భాగంగా తమ వలలు లాక్కెళ్లినట్లు బాధితులు వాపోతున్నారు. సమస్యలను అధికారుల దృష్టికి తీసుకెళ్లినా ప్రయోజనం లేదని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పరిస్థితి ఇలాగే కొనసాగితే మత్స్యశాఖ కార్యాలయాన్ని ముట్టడిస్తామని వారు హెచ్చరిస్తున్నారు. కడలూరు బోట్ల కారణంగా తమ వలలో తెగిపోవటం లక్షల్లో నష్టపోయినట్లు తెలిపారు. అందుకు అధికారులే సమాధానం చెప్పాలని మత్స్యకారులు డిమాండ్ చేస్తున్నారు.

ఒడ్డుకొచ్చి వేటాడుతున్న కడలూరు సోనా బోటు

సోనా బోట్ల కారణం తెగిపోయిన వలలు

చిన్నారి కిడ్నాప్‌కు యత్నం

- అప్రమత్తమైన తల్లి
- దుండగుడు పరారీ

ప్రజాశక్తి-దొనకొండ

మండల పరిధిలోని పోలేపల్లిలో ఉయ్యాలో నిద్రిస్తున్న ఆరు నెలల చిన్నారిని కిడ్నాప్ చేసేందుకు ఓ వ్యక్తి యత్నించాడు. బాలిక తల్లి అప్రమత్తం కావడంతో చిన్నారి ఇంటి వెనుక వదేసి దుండగుడు పరారీ అయ్యాడు. అందిన వివరాల ప్రకారం... గ్రామానికి చెందిన సోనియా అనే మహిళ తమ చిన్నారి ఇంట్లో ఉయాల్లో పండుకోబెట్టింది. గుర్తు తెలియని వ్యక్తి ఇంటి సందులో నుంచి వచ్చి ఉయ్యాలలో ఉన్న చిన్నారి ఎత్తుకొని పరారీ అవుతున్నాడు. ఇంతలో చిన్నారి ఏడ్చింది. దీంతో సోనియా పాపను ఎత్తుకెళ్లటం చూసి పెద్దపెద్దగా కేకలు వేసింది. దీంతో దుండగుడు పాపను ఇంటి వెనుక వదేసి పరారీ అయ్యాడు. చిన్నారి ఎలాంటి దెబ్బలూ తగలక పోవటంతో సోనియా ఊపిరి పీల్చుకుంది. బంధువులు దుండగుడిని వెంబడించగా కనిపించలేదు.

ఉపాధిపనులపై సామాజిక తనిఖీ ప్రజావేదిక

పెద్దారవీడు : ఉపాధి హామీ పనులపై సామాజిక తనిఖీ ప్రజా వేదిక బుధవారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఎంపిడిఒ రాజ్‌కుమార్ అధ్యక్షత నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పీడీ శీనారెడ్డి, ఏపీడీ నిర్మలాదేవి, విజిలెన్స్ అధికారి పాల్గొన్నారు. మండల పరిధిలోని 19 పంచాయతీ పరిధిలో 11825 మందికి జాబ్ కార్డులు ఉన్నట్లు తెలిపారు. 2022- 23 ఆర్థిక సంవత్సరంలో ఉపాధి పనులకు రూ.12,26,78 ఖర్చు చేసినట్లు సామాజిక తనిఖీ బందం తెలిపారు. 6,63,716 పని దినాలు కల్పించినట్లు వివరించారు. మండల పరిధిలోని రేగుమానుపల్లి, పోతంపల్లి గ్రామాల్లో ఫీల్డ్‌అసిస్టెంట్‌కు బదులుగా ఇతర వ్యక్తి పనులు చేయించినట్లు వివరించారు. ఎం.బుక్‌లపై ఎంపిడిఒ, అధికారుల సంతకాలు లేకుండా బిల్లులు చేసినట్లు వివరించారు. దీంతో పీడీ సీనారెడ్డి మాట్లాడుతూ అక్రమాలకు పాల్పడిన వారిపై క్రిమినల్ కేసులు నమోదు చేయాలని ఎంపిడిఒకు సూచించారు. ఉపాధి పనులు తనిఖీ సమయంలో తంగిరాలపల్లి గ్రామంలో కొందరు తమ జాబ్‌కార్డులు తొలగించినట్లు తమదృష్టికి తెచ్చినట్లు తెలిపారు. దీంతో నలుగురిపై క్రిమినల్ కేసులు నమోదు చేయాలని పీడీ సీనారెడ్డి ఆదేశించారు. ఈ సందర్భంగా పీడీ శీనారెడ్డి మాట్లాడుతూ టెక్నికల్ అసిస్టెంట్లు, ఫీల్డ్ అసిస్టెంట్లు అక్రమాలకు పాల్పడితే వారిపై చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

గుర్తుతెలియని వ్యక్తులు చించివేసిన ఫ్లెక్సీలు

టిడిపి ఫ్లెక్సీలు చించివేత

టంగుటూరు : టంగుటూరులో నిజం గెలవాలి కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా స్థానిక టోల్ ప్లాజా వద్ద టిడిపి నాయకులు నారా భువనేశ్వరి స్వాగతం పలుకుతూ ఫ్లెక్సీలు ఏర్పాటు చేశారు. ఈ ఫ్లెక్సీలను గుర్తుతెలియని కొందరు వ్యక్తులు చించి వేశారు. బుధవారం 12 గంటల సమయంలో టోల్ ప్లాజా వద్దకు చేరుకున్న టిడిపి నాయకులు ఈ చర్యను చూసి అవాక్కయ్యారు. టోల్ ప్లాజా సిబ్బందిని కలిసి మీ అనుమతితోనే తాము ఫ్లెక్సీలు ఏర్పాటు చేశామని, ఇంతలోనే ఫ్లెక్సీలు చించివేసింది ఎవరని ప్రశ్నించారు. దీంతో టిడిపి నాయకులు కామని నాగశ్రీను, పోకూరి రవీంద్రబాబు, టోల్ ప్లాజా సిబ్బంది మధ్య తీవ్ర వాగ్వాదం చోటు చేసుకుంది. టోల్ ప్లాజా వద్ద ఉన్న సిసి ఫుటేజీలను పరిశీలించాలని టిడిపి నాయకులు పట్టుబట్టారు. ఈ ఘటనకు పాల్పడింది ఎవరైనా సరే వదిలిపెట్టే ప్రసక్తి లేదని వారు హెచ్చరించారు. అధికార పార్టీ మంత్రి అండతోనే స్థానిక వైసిపి నాయకులు ఈ దుశ్చర్యకు తెగబడ్డారని వారు ఆగ్రహం వ్యక్తం చేశారు. టోల్ ప్లాజా వద్దకు భారీగా చేరుకున్న టిడిపి నాయకుల ఆగ్రహంతో అక్కడ కొంత ఉద్రిక్తత పరిస్థితి నెలకొంది. వాస్తవాలను పరిశీలించి దీనికి కారకులైన వారిని కఠినంగా శిక్షించాలని టిడిపి నాయకులు పోలీసులకు ఫిర్యాదు చేశారు.

మద్యం బాటిళ్లు స్వాధీనం

యర్రగొండపాలెం : యర్రగొండపాలెం స్పెషల్ ఎన్‌ఫోర్సు మెంట్ ఇన్‌స్పెక్టర్ పి.నాగేశ్వరరావు ఆధ్వర్యంలో సిబ్బంది త్రిపురాంతకంలో బుధవారం దాడులు నిర్వహించారు. ఈ సందర్భంగా అక్రమంగా మద్యం విక్రయిస్తున్న గుమ్మా అంజయ్య, పుల్లగొర్ల నర్సింహులు, కొండ్రు రామారావు, దూదేకుల మీరావలిని అరెస్టు చేసి వారి వద్ద నుంచి 200 మద్యం బాటిళ్లు, రెండు బైకులు స్వాధీనం చేసుకున్నారు. ఈ దాడులలో యర్రగొండపాలెం ఎస్ఐబి ఎస్ఐ మోహన్, కానిస్టేబుల్ రమేష్ బాబు, శ్రీనివాసులు పాల్గొన్నారు.

పంటలను పరిశీలించిన దక్షిణాఫ్రికా బృందం

ప్రజాశక్తి-కొత్తపట్నం

కొత్తపట్నం గ్రామంలో రైతు సాధికార సంస్థ, ఆంధ్రప్రదేశ్ కమ్యూనిటీ నేచురల్ ఫార్మింగ్ ఆధ్వర్యంలో ప్రకృతి వ్యవసాయం పద్ధతుల్లో సాగు చేసిన పంటలను దక్షిణాఫ్రికా దేశంలోని హెడెన్‌బర్గ్‌కు చెందిన ఈషాని, ధనియా ప్రతినిధుల బందం బుధవారం సందర్శించింది. తొలుత కొత్తపట్నం -6 గ్రామ సంఘంలోని ఎస్‌సి రైతులు సామూహికంగా సాగు చేస్తున్న వరి పంటను పరిశీలించారు. అనంతరం రైతులతో మాట్లాడి అనుభవాల గురించి అడిగి తెలుసుకున్నారు. అదేవిధంగా పాదర్తి చిన్న శ్రీనివాసులు, భవాని సాగు చేస్తున్న నిరంతర ఆకుకూరలు కూరగాయల సాగును పరిశీలించారు. చిన్న వెంకటేశ్వర్ రెడ్డి సాగు చేసిన వేరుశనగ పంట, కట్టా యమున పొలం చుట్టూ సాగు చేసిన మిర్చి, వేరుశనగ, చేమదుంపల పంటలను పరిశీలించారు. అనంతరం పురిని మల్లేశ్వరమ్మ నిర్వహిస్తున్న ప్రకృతి వ్యవసాయ వనరుల కేంద్రంలోని కషాయాలు, ద్రావణాలను పరిశీలించారు. ఈ సందర్భంగా దశ పర్ని, అగ్నిస్త్రం, బ్రహ్మాస్త్రం , కాషాయాలను డెమో ద్వారా ప్రకృతి వ్యవసాయం సిబ్బంది వారికి వివరించారు. ఈ కార్యక్రమంలో ప్రకతి వ్యవసాయం జిల్లా ప్రాజెక్ట్ మేనేజర్ సుభాషిణి, రీజనల్ కోఆర్డినేటర్ వెంకటరావు,ఉదయ్ కుమార్, మహేష్ , ప్రకతి వ్యవసాయం సిబ్బంది నరసింహులు, పట్టపు ఇందిరా,బిసిఆర్‌పిలు పట్టపు సురేష్ ,పట్టపు ప్రవీణ్ కుమార్, ప్రేమానందం , పట్టపు సునీత, శశి ,రాజశేఖర్, రైతులు పాల్గొన్నారు.

ఆకుకూరలను పరిశీలిస్తున్న దక్షిణాఫ్రికా బృందం

జనసేన పాదయాత్రకు 'టిడిపి' దుమ్మా..

ప్రజాశక్తి-మార్కాపురం

టిడిపితో పొత్తు కుదుర్చుకున్న జనసేన పార్టీ ముందుకు పోతోంది. ప్రజా సమస్యలు, రాజకీయంగా, ఉమ్మడిగా కార్యక్రమాలు చేపడుతుతోంది. రాష్ట్ర వ్యాప్తంగా టిడిపి - జనసేన పార్టీ ఆ విధంగా కలిసి పనిచేయాలని అటు చంద్రబాబు, ఇటు పవన్ కళ్యాణ్‌లు ఆయా పార్టీల నేతలకు, కార్యకర్తలకు సందేశాలిచ్చారు. మార్కాపురం నియోజకవర్గంలో మాత్రం అందుకు భిన్నంగా జరుగుతోందని జనసేన పార్టీ తలపెట్టిన పాదయాత్ర వెల్లడిస్తోంది.

మార్కాపురం ప్రాంతం వర్షాధారంపై ఆధారపడింది. వెలిగొండ ప్రాజెక్టు రాకతో సస్యశ్యామలం కానుంది. వెలిగొండ ప్రాజెక్టు ప్రారంభంలో జాప్యం జరుగుతోంది. మార్కాపురం కేంద్రంగా జిల్లా ఏర్పాటు కూడా ఇక్కడి ప్రజల ఆకాంక్ష. దానికి అనుగుణంగా జనసేన పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి ఇమ్మడి కాశీనాథ్ పాదయాత్ర తలపెట్టారు. ఈ పాదయాత్ర జనసేన-టిడిపి ఉమ్మడిగా ప్రారంభమైంది. పాదయాత్ర ఎలా జరగాలి అనేదానిపై టిడిపి నియోజకవర్గ ఇన్‌చార్జి, మాజీ ఎమ్మెల్యే కందుల నారాయణరెడ్డి, జనసేన పార్టీ ఇన్‌ఛార్జి ఇమ్మడి కాశీనాథ్‌తో పాదయాత్ర ముందు రోజు సమావేశమయ్యారు. ఆ సమయంలో నియోజకవర్గ వ్యాప్తంగా టిడిపి సహకరిస్తుందని కందుల మాట ఇచ్చినట్లు తెలిసింది. పాదయాత్ర ప్రారంభంలోనూ టిడిపి ముఖ్య నేతలంతా పాల్గొన్నారు. పాదయాత్రలో జనసేన, టిడిపి జెండాలతో కొనసాగుతున్నా... టిడిపి నేతలు, కార్యకర్తలు కాశీనాథ్ పాదయాత్రకు దూరంగా ఉన్నట్లు తెలిసింది. టిడిపి ముఖ్య నేతలు కూడా కార్యకర్తలు పాల్గొనాలని చెప్పినా వారు కనిపించలేదు. జనసేన పార్టీ క్యాడర్‌తోనే పాదయాత్ర సాగుతోంది. జనసేన పార్టీ ఇన్‌చార్జి ఇమ్మడి కాశీనాథ్ మొన్నటి వరకు టిడిపిలో కొనసాగినందున ఆయన అనుచరులు కొందరు టిడిపిలో ఉన్నారు. పాదయాత్రకు కాశీనాథ్‌తో సంబంధాలు కలిన వారు మాత్రమే అక్కడక్కడా పాల్గొంటున్నారు. గ్రామాల్లో టిడిపి బలంగా ఉన్నా... జనసేన పార్టీ పాదయాత్ర ఒంటరిగానే సాగుతోంది. టిడిపి ఎందుకు దూరంగా ఉంటోందని కాశీనాథ్ ఆరా తీసినట్లు సమాచారం. పార్టీ అధినాయకులు తమకు ఆదేశించక పోవడంతో పాల్గొనడం లేదనేది సమాచారం. వచ్చే ఎన్నికల్లోనూ టిడిపి సహకరిస్తే పాదయాత్రతో కొంత ప్రయోజనం కలిగేది. ఆ ప్రయోజనం కూడా టిడిపికే దక్కేది. ఎందుకు సహకరించడం లేదోనని జనసేనలో చర్చ సాగుతోంది. వచ్చే ఎన్నికల్లోనూ ఇదే తేడా కనిపిస్తే టిడిపి-జనసేన పొత్తుతో లాభమా... నష్టమా అనే దానిపై ఆ రెండు పార్టీల్లోని నేతలు చర్చించుకోవడం గమనార్హం.!

పాదయాత్రలో కాశీనాథ్

క్రీడలు ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే కరణం బలరాం

క్రీడలతో మంచి ఆరోగ్యం

ప్రజాశక్తి - చీరాల

యువత క్రీడల్లో ఉత్సాహంగా ఉండాలని, క్రీడలతో శరీర దారుఢ్యంతోపాటు మంచి ఆరోగ్యం లభిస్తోందని ఎమ్మెల్యే కరణం బలరామకృష్ణమూర్తి అన్నారు. స్థానిక ఎన్ఆర్ అండ్ పిఎం హైస్కూల్ ఆవరణంలో డిస్టిక్ షఉటింగ్ బాల్ ప్రెసిడెంట్ డాక్టర్ ఇస్తర్ల బాబురావు, సుభాషిణి దంపతుల ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన నేషనల్ ఛాంపియన్ షిప్ అండర్-17, 19షఉటింగ్ బాల్ టోర్నమెంట్ బుధవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా డాక్టర్ బాబురావు మాట్లాడుతూ క్రీడల్లో గెలుపు ఓటములు సహజమని అన్నారు. స్నేహపూరిత వాతావరణంలో క్రీడలు నిర్వహించాలని కోరారు. కార్యక్రమంలో చైర్మన్ జంజనం శ్రీనివాసరావు, రాష్ట్ర మహిళా విభాగ జాయింట్ సెక్రటరీ మల్లెల లలిత రాజశేఖర్, జిల్లా వాణిజ్య విభాగ అధ్యక్షులు చీమకుర్తి బాలకృష్ణ, వైసిపి పట్టణ ప్రధాన కార్యదర్శి చిలుకోటి శ్రీనివాసరావు, క్రీడాకారులు పాల్గొన్నారు.

కమిషనర్ కు బుకె అందిస్తున్న యూనియన్ నాయకులు

నూతన కమిషనర్‌కు స్వాగతం

ప్రజాశక్తి - చీరాల

మున్సిపల్ కమిషనర్‌గా నూతనంగా బుధవారం ఉద్యోగ బాధ్యతలు చేపట్టిన విజయ సారథికి మున్సిపల్ యూనియన్ నాయకులు, ఇతర ఉద్యోగులు ఘన స్వాగతం పలికారు. పూల బొకెలు, సాలువాతో సత్కరించారు. ఈ సందర్భంగా కమిషనర్ విజయ సారథి మాట్లాడుతూ పట్టణ అభివృద్ధికి తన వంతు కృషిచేస్తానని అన్నారు. ప్రజల సమస్యల పరిష్కరిస్తానని అన్నారు. సమస్యలు ఏమైనా ఉంటే తన దృష్టికి తీసుకురావాలని కోరారు. అభివృద్ధికి ప్రజలందరూ సహకరించాలని కోరారు. కార్యక్రమంలో యున్సిపల్ వర్కర్స్ యూనియన్ నాయకులు వై సింగయ్య, సిఐటియు అధ్యక్షులు ఎన్ బాబురావు పాల్గొన్నారు.

అబ్దుల్ సత్తార్‌ను సన్మానిస్తున్న ఎంఎల్ఎ కోన రఘుపతి

అబ్దుల్ సత్తార్‌కు సన్మానం

ప్రజాశక్తి - బాపట్ల

ఎదిగిన కొద్దీ ఒదిగి ఉండే వ్యక్తిత్వం కలిగి విధి నిర్వహణే ఘనతకు మార్గంగా భావించి వ్యవసాయ శాఖలో 32ఏళ్ళుగా విశిష్ట సేవలు అందించిన వ్యవసాయ శాఖ జిల్లా అధికారి కోమటిగుంట షేక్ అబ్దుల్ సత్తార్ ఉత్తమ అధికారిగా పేరు ప్రఖ్యాతి గడించారని ఎంఎల్ఎ కోన రఘుపతి అన్నారు. అబ్దుల్ సత్తార్ ఉద్యోగ విరమణ సభ అన్నం సతీష్ ప్రభాకరకాపు కళ్యాణ మండపంలో నిర్వహించారు. రైతుల కష్టసుఖాలు తెలిసిన వ్యక్తిగా సేవలు అందించారని అన్నారు. అబ్దుల్ సత్తార్‌ను పలువురు అధికారులు ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో ఆర్డిఓ జి రవీంద్ర, వ్యవసాయ కమిషనర్ కార్యాలయ ఎడి వినయ్ చందు, జెడిఏలు కృపాదాస్, శ్రీధర్, విజయభారతి, శ్రీనివాసరావు, వెంకటేశ్వర్లు, మురళి, ప్రకాశం, గుంటూరు, పల్నాడు, బాపట్ల జిల్లాల వ్యవసాయ అధికారులు పాల్గొన్నారు.

యుటిఎఫ్ ఆధ్వర్యంలో రిలే దీక్షలు

ప్రజాశక్తి - బాపట్ల

ఉద్యోగ, ఉపాధ్యాయులకు రావలసిన ఆర్థిక బకాయిలను వెంటనే చెల్లించాలని యుటియఫ్ ఆధ్వర్యంలో బుధవారం రిలే నిరహార దీక్షలను యుటిఎఫ్ సీనియర్ నాయకులు నూతలపాటి కోటేశ్వరరావు, వై భాస్కరరావు ప్రారంభించారు. ఈ సందర్భంగా యుటిఎఫ్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు జె వినయ్ కుమార్, అడుగుల శ్రీనివాసరావు మాట్లాడుతూ 11 లక్షల మంది ఉద్యోగ, ఉపాధ్యాయుల ఆర్థిక బకాయిల చెల్లింపు అంశంపై ప్రభుత్వం నిరంకుశ వైఖరి అవలంభిస్తోందని అన్నారు. ప్రతినెల 1న జీతాలు చెల్లించాలని డిమాండ్ చేశారు. ఉపాధ్యాయుల ఇతర సమస్యలు పరిష్కరించాలని కోరారు. ఫిబ్రవరి 3 వరకు 4రోజుల పాటు దీక్షలు కొనసాగుతాయని తెలిపారు. కార్యక్రమంలో యుటిఎఫ్ జిల్లా గౌరవ అధ్యక్షులు ఎస్

దీక్ష ప్రారంభిస్తున్న యుటిఎఫ్ నాయకులు కోటేశ్వరరావు

పాపారావు, ఉపాధ్యక్షులు బి బిక్షాలుబాబు, ఆర్ హరిప్రియ, కోశాధికారి మచ్చా వెంకటేశ్వరెడ్డి, రాష్ట్ర కౌన్సిలర్ చుక్కా బాపయ్య, జిల్లా కార్యదర్శులు సుబ్రహ్మణ్యం, జాని బాషా, పరాష్ వినోద్, విజయలక్ష్మి, కోటేశ్వరరావు, పద్మావతి పాల్గొన్నారు.

9వ రోజు ఐకెపి ఉద్యోగుల సమ్మె

ప్రజాశక్తి - బాపట్ల

వైఎస్సార్ క్రాంతి పథం ఉద్యోగులు చేపట్టిన సమ్మె బుధవారం 9వ రోజుకు చేరింది. వైఎస్సార్ క్రాంతి పథంలో వివిధ విభాగాల్లో పనిచేస్తున్న ఉద్యోగుల న్యాయమైన డిమాండ్ల సాధనకోసం జనవరి 23నుండి చేపట్టిన నిరవధిక సమ్మెలో భాగంగా స్థానిక క్రీడా ప్రాంగణం ఎదురు ఏర్పాటు చేసిన దీక్షా శిబిరంలో కె ప్రకాశరావు, సిహెచ్ రాజశేఖర్, ఎం బాటసారి, డి వెంకటేశ్వర్లు, కె సాంబయ్య 9వ రోజు నిరాహారదీక్షలో కూర్చున్నారు. గ్రామీణ పేదరిక నిర్మూలన పథకం ఉద్యోగులు చేపట్టిన రిలే నిరాహార దీక్షలకు అంటరాని నిర్మూల సమితి రాష్ట్ర అధ్యక్షులు చార్వాక సంఘీభావం తెలిపారు. కార్యక్రమంలో వైఎస్సార్ క్రాంతి పథకం జెఎసి

దీక్షకు సంఘీభావం తెలుపుతున్న చార్వాక

నాయకులు టి శ్రీనివాస్, తూమాటి రాజారావు, చాట్ల సాల్మన్, కాకి రవికుమార్, కె వెంకటస్వామి, వందనం పాల్గొన్నారు.

ల్యాండ్ టైటిలింగ్ యాక్ట్ రద్దుకు కలిసి ఉద్యమిద్దాం

ప్రజాశక్తి - బాపట్ల

ల్యాండ్ టైటిలింగ్ యాక్ట్ రద్దుకు గుంటూరు, బాపట్ల జిల్లాల బార్ అసోసియేషన్లు కలిసి కట్టుగా ఉద్యమిద్దామని గుంటూరు జిల్లా బార్ ఫెడరేషన్ సభ్యులు నీలం రామ్మోహనరావు కోరారు. బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఎపి ల్యాండ్ టైటిలింగ్ యాక్ట్- 2023 రద్దుపై జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. యాక్టుతో ప్రజలకు వచ్చే ఇబ్బందులను వివరించాలని, ప్రజా ఉద్యమంతో ప్రభుత్వంపై ఒత్తిడి తేవాలని అన్నారు. సమావేశానికి బార్ అసోసియేషన్ అధ్యక్షుడు భీమా లీలాకృష్ణ అధ్యక్షత వహించారు. సమావేశంలో గుంటూరు జిల్లా బార్ ఫెడరేషన్ సభ్యులు, సీనియర్ న్యాయవాదులు రాజారావు, బార్ కౌన్సిల్ సభ్యులు సొమ్మాసాని బ్రహ్మానందరెడ్డి, చిగురుపాటి రవీంద్రబాబు, కట్టా కాళిదాస్, చుక్కపల్లి రమేష్, బాపట్ల బార్

సమావేశంలో న్యాయవాది నీలం రామ్మోహనరావు

అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి ఇమ్మడిశెట్టి బాలకృష్ణ, విన్నకోట సత్యప్రసాద్, నల్లమోతు సుబ్బారావు, దుద్దుకూరి శ్రీరామమూర్తి, బండి రామమూర్తి, యలవల నరేష్, ఉషారాణి, కె రవిబాబు, బిల్లా కమల్ కుమార్, నందనవనం ప్రసాద్, రవీంద్రబాబు, ఫిలిప్ పాల్గొన్నారు.

వ్యక్తిత్వ వికాసంపై సెమినార్

ప్రజాశక్తి - వేటపాలెం

సెయింట్ ఆన్స్ ఇంజినీరింగ్ కళాశాల్లో బి టెక్ విద్యార్థులకు లైఫ్ సక్సెస్ అంశంపై సెమినార్ నిర్వహించినట్లు కళాశాల సెక్రటరీ వనమా రామకృష్ణారావు, కరస్పాండెంట్ శ్రీమంతుల లక్ష్మణరావు తెలిపారు. పోటీ ప్రపంచంలో ప్రతి విద్యార్థికి చదువుతోపాటు వ్యక్తిత్వ విలువలు, జీవిత ఆశయం, విజయ సాధన కలిగి ఉండాలని కళాశాల ప్రిన్సిపాల్ ఎం వేణుగోపాలరావు అన్నారు. సంకల్పం లైఫ్ స్కూల్‌కు చెందిన అమెరికా నుండి ఎన్ఆర్ఐ వెంకట్ హాజరై తాను రచించిన సంకల్పం, సంకల్ప యజ్ఞం పుస్తకాల నుండి ఎన్నుకోబడిన 10లైఫ్ సక్సెస్ నిబంధనలను "ఎక్సయల్ మెథాడలజీ" అనే పద్ధతి ద్వారా వివరించారు. ఎన్ఆర్ఐ వెంకట్ విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడారు. ప్రతి విద్యార్థి జీవితంలో విజయం సాధించటానికి కావలిసిన మైండ్ సెట్ ఎలా ప్రిపేర్ చేసుకోవాలో తెలిపారు. ప్రతి విద్యార్థి జీవితంలో ఏవిదంగా ఎదగాలో దానిపై అవగాహన పెంచుకోవాలని అన్నారు. దానికి తగిన రీతిలో మైండ్ సెట్ ప్రిపేర్ చేసుకోవాలని తెలిపారు. విద్యార్థులు చదువుతున్న సమయంలోనే వ్యక్తిత్వ వికాసం

సెమినార్‌లో మాట్లాడుతున్న ప్రిన్సిపాల్ రామాంజనేయులు

పెంపొందించుకోవాలని అన్నారు. అలాంటి విద్యార్థులు సమాజంలో ఎటువంటి కష్టాన్నైనా సమర్థవంతంగా ఎదుర్కోగలరని తెలిపారు. మనస్సును ఎలా అదుపులో ఉంచుకోవాలో తెలిసిన వ్యక్తి సమాజంలో ఉన్నత స్థాయిలో ఉంటారని తెలిపారు. ప్రతివ్యక్తిలో అనంతమైన శక్తి, ప్రతిభ, సామర్థ్యం దాగి ఉన్నాయిని అన్నారు. వాటిని భాధ్యతతో, ప్రేరణతతో, సంకల్ప సిద్ధితోతో వెలికి తీసినట్టైతే అనుకున్న దానిని సాధించగలరని తెలిపారు. ఇటువంటి సెమినార్లు విద్యార్థుల అభివృద్ధికి తోత్పడతాయని ప్రిన్సిపాల్ వేణుగోపాలరావు అన్నారు.

విద్యార్థులతో న్యాయవాది సతీష్‌రెడ్డి

విద్యతోనే ఉన్నతాభివృద్ధి

ప్రజాశక్తి - చీరాల

విద్యతోనే మంచి భవిష్యత్తు లభిస్తుందని పలువురు న్యాయవాదులు అన్నారు. అంతర్జాతీయ వీధి బాలల దినోత్సవం సందర్భంగా న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో మండలంలోని ఈపురుపాలెం లైట్ హౌస్ చిల్డ్రన్స్ హెూంలో న్యాయ విజ్ఞాన సదస్సు బుధవారం నిర్వహించారు. పోక్సో యాక్ట్, బాల కార్మిక నిరోధక చట్టంతో పాటు వివిధ చట్టాలను వివరించారు. చదువు ఆవశ్యకత తెలిపారు. కార్యక్రమంలో బార్ అసోసియేషన్ న్యాయవాదులు ఎ సతీష్‌రెడ్డి, టీ సురేష్, పిఎల్‌విఎస్‌డి మతీన్, లైట్ హౌస్ చిల్డ్రన్స్ హెూం నిర్వాహకులు ఎ జాన్ రాబర్ట్ స్టీవెన్ సన్ పాల్గొన్నారు.

ఎంపిడిఒగా ఎన్‌విజికె మూర్తి

ప్రజాశక్తి - చిన్నగంజాం

ఈఒపీఆర్డి ఎన్‌విజికె మూర్తికి ఎఫ్ఎసి ఎంపీడీఒగా బుధవారం ఉత్తర్వులు ఇచ్చారు. ఎంపీడీఒగా పని చేస్తున్న కె స్వరూపరాణి గుంటూరు జిల్లాకు బదిలీ అయ్యారు. దీంతో అక్కడే యుఆర్‌డిగా పనిచేస్తున్న మూర్తిని ఇన్చార్జి ఎంపీడీఒగా నియమించారు.

ఎన్‌విజికె మూర్తి

నూతనంగా ఎన్నికైన వాసవీ క్లబ్ పాలకవర్గం

వాసవీ క్లబ్ అధ్యక్షునిగా మురళి

ప్రజాశక్తి - మార్టూరు రూరల్

వాసవి క్లబ్ నూతన అధ్యక్షుడిగా మార్టూరుకు చెందిన మోదడుగు మురళిని సంఘ సభ్యులు ఏకగ్రీవంగా స్థానిక ఆర్యవైశ్య సంఘం భవనంలో బుధవారం ఎన్నుకున్నారు. కార్యదర్శిగా శ్రీరామ్ పవన్, కోశాధికారిగా అర్వపల్లి సురేంద్ర ఎన్నికయ్యారు. పరిశీలకులుగా వాసవి ఇంటర్నేషనల్ వైస్ ప్రెసిడెంట్ సుదర్శన్, సాయి, చంద్రకళ, వాసవి క్లబ్ సభ్యులు పాల్గొన్నారు.

కలెక్టర్ రంజిత్ భాషకు ఈర్జీ ఇస్తున్న పాత్రికేయులు

కలెక్టర్‌కు పాత్రికేయుల వినతి

ప్రజాశక్తి - సంతమాగులూరు

మండలంలో గత కొన్నేళ్లుగా వివిధ పత్రికలు, ఎలక్ట్రానిక్ మీడియాలో పనిచేస్తున్న పాత్రికేయులకు అక్రిడియేషన్లు, ఇళ్ల స్థలాలు మంజూరుకాక తాము తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని పాత్రికేయులు బుధవారం జరిగిన జగనన్న కు చెబుదాం స్పందనలో కలెక్టర్ పి రంజిత్ భాషాకు అర్జీ అందజేశారు. స్పందించిన కలెక్టర్ వెంటనే విలేకరుల సమస్యను పరిష్కరించాలని సంబంధిత అధికారులకు ఆదేశాలు ఇచ్చారు. పాత్రికేయుల నివేశన స్థలాల సమస్యపై ప్రభుత్వం కార్యాచరణ చేపట్టినట్లు తెలిపారు. పెండింగులో ఉన్న సమస్యలను సత్వరం పరిష్కారం చేయాలని ఆదేశించారు. కార్యక్రమంలో పాత్రికేయులు ఓర్చు కొండలు, బి కృష్ణారెడ్డి, ఎం సుబ్బారావు, మారుతి సుబ్బారావు, జెఎంజె ఆంజనేయులు, కాలేషా, సుబ్బారావు పాల్గొన్నారు.

ప్రజాశక్తి 5
గురువారం 1 ఫిబ్రవరి 2024

లబ్ధిదారులకు చెక్కు అందజేస్తున్న బూచేపల్లి

వైసీపీ ప్రభుత్వంలో

మహిళలకు అన్ని విధాలా మేలు

జడ్పీ ఛైర్‌పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ

ప్రజాశక్తి-దర్శి

ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వంలో మహిళలకు అన్ని విధాలా మేలు జరుగుతోందని, వచ్చే ఎన్నికల్లో ముఖ్యమంత్రిగా జగన్‌మోహన్‌రెడ్డిని గెలిపించాలని జిల్లాపరిషత్ చైర్మన్ బూచేపల్లి వెంకాయమ్మ, వైసిపి దర్శి ఇన్‌ఛార్జి బూచేపల్లి శివప్రసాద్‌రెడ్డి అన్నారు. బుధవారం తాళ్లూరు మండలంలోని మండల పరిషత్ కార్యాలయం వద్ద నాల్గో విడత వైఎస్సార్ ఆసరా చెక్కుల పంపిణీలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా రూ.ఆరు కోట్ల 67 లక్షల చెక్కును మహిళలకు అందించారు. ఈ సందర్భంగా బూచేపల్లి మాట్లాడుతూ రాష్ట్రంలో వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి గతంలో ఎన్నడూ లేని విధంగా మహిళల కోసం అనేక సంక్షేమ కార్యక్రమాలను నేరుగా ప్రవేశపెట్టారని అన్నారు. అమ్మఒడి, ఆసరా, చేయూత, కాపునేస్తం వంటి పథకాలను ప్రవేశపెట్టారని చెప్పారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీలతో పాటు ఇవ్వని హామీలను కూడా నెరవేర్చారని అన్నారు. భవిష్యత్తులోనూ జగన్‌మోహన్‌రెడ్డి ఈ రాష్ట్రానికి ఎంతో అవసరమన్నారు. వచ్చే ఎన్నికల్లో శివప్రసాద్‌రెడ్డి దర్శిలో పోటీ చేస్తున్నారని, అత్యధిక మెజార్టీతో గెలిపించాలని వెంకాయమ్మ అన్నారు. ముందుగా వైఎస్సార్, బీఎస్సార్ చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ముఖ్యమంత్రి జగన్ చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. మహిళలు పెద్దఎత్తున హాజరయ్యారు. కార్యక్రమంలో ఎంపీడీఓ కే.యుగకీర్తి, ఎమ్మార్వో ప్రసాద్, ఎంఈఓ జి.సుబ్బమ్మతో పాటు మండల పార్టీ అధ్యక్షులు తూము సుబ్బారెడ్డి, వైస్ ఎంపీపీ ఇడమకంటి వెంకటేశ్వరరెడ్డి, మాజీ ఎంపీపీలు గోళ్ళపాటి మధుసూదన్‌రెడ్డి, కోటా రామిరెడ్డి, గోళ్ళమోషే, వైసీపీ సంయుక్త కార్యదర్శి సుబ్బారెడ్డి, సర్పంచ్‌ల సంఘం అధ్యక్షులు ఇంద్రసేనారెడ్డి, సర్పంచ్‌లు చార్లసర్జన్, కోటా శివలక్ష్మీ, వెంకటరామిరెడ్డి, వైస్ సర్పంచ్ పులి ప్రసాద్‌రెడ్డి, కొండారెడ్డి, రామకృష్ణ, శ్రీనివాసరెడ్డి పాల్గొన్నారు.

మాట్లాడుతున్న మద్దిశెట్టి వేణుగోపాల్

నమ్ముకున్న కార్యకర్తలకు

న్యాయం చేస్తా..

దర్శి ఎమ్మెల్యే మద్దిశెట్టి వేణుగోపాల్

ప్రజాశక్తి-దర్శి

తనను నమ్ముకున్న నాయకులు, కార్యకర్తలకు న్యాయం చేస్తానని ఎమ్మెల్యే మద్దిశెట్టి వేణుగోపాల్ అన్నారు. బుధవారం స్థానిక ఎమ్మెల్యే నివాసంలో నాయకులు, కార్యకర్తలు ఆత్మీయ సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 2019 ఎన్నికల్లో తనను గతంలో ఎప్పుడు లేని విధంగా 40 వేల మెజార్టీతో గెలిపించారని అన్నారు. దొనకొండ, ముండ్లమూరు ఎంపీపీల విషయంలో వారికి న్యాయం జరిగే వరకు పోరాటం చేశానన్నారు. జీవితంలో విజయం చూశాను గానీ ఓటమి చూడలేదన్నారు. ప్రస్తుతం కొంతమంది అధికారులు తనను నమ్మిన వారిని ఇబ్బంది పెడుతున్నారని, తాను ఇంకా ఎమ్మెల్యేగా ఉన్నానని గుర్తుచేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యేను పలువురు ఘనంగా సన్మానించారు. వైసీపీ దర్శి ఇన్‌ఛార్జిగా బూచేపల్లిని ప్రకటించిన తరువాత మొదటిసారిగా ఎమ్మెల్యే మద్దిశెట్టి వస్తున్న సందర్భంగా ముండ్లమూరు నుండి కార్లతో భారీ ర్యాలీగా దర్శికి చేరుకున్నారు. కార్యక్రమంలో మద్దిశెట్టి రవీంద్ర, మద్దిశెట్టి శ్రీధర్, మద్దిశెట్టి వాసు, ఏఎంసీ చైర్మన్ మిల్లర్ బుజ్జి, తాళ్లూరు ఎంపీపీ తాటికొండ శ్రీనివాసరావు, ఎంపీపీలు బెల్లం చంద్రశేఖర్, జడ్పీటీసీ మారం వెంకారెడ్డి, మాజీ జడ్పీటీసీ శ్రీకాంత్‌రెడ్డి పాల్గొన్నారు.

వైద్య కళాశాల, జిజిహెచ్‌లో

ఉద్యోగాల ఎంపిక ప్రక్రియ వేగవంతం

ప్రభుత్వ వైద్య కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఏడుకొండలరావు

మాట్లాడుతున్న డాక్టర్ ఏడుకొండలరావు

ప్రజాశక్తి-ఒంగోలు కలెక్టరేట్

ఒంగోలు, మార్కాపురం వైద్య కళాశాల మరియు జిజిహెచ్, నర్సింగ్ కళాశాలల్లో భర్తీ చెయ్యనున్న 298 పోస్టులకు సంబంధించి వడపోత కార్యక్రమం జరుగుతోందని, మెరిట్ జాబితా ప్రకటించాక అభ్యంతరాల స్వీకరణ వుంటుందని, దళారులు, ఇతరుల మాటలు నమ్మి మోసపోవద్దని వైద్య కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఏ కొండలరావు తెలిపారు. పోస్టుల భర్తీ ప్రక్రియ, విధివిధానాలను ఆయన వైద్య కళాశాల ప్రిన్సిపాల్ ఛాంబర్‌లో బుధవారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో వెల్లడించారు. మొత్తం 44 కేటగిరిల్లో పోస్టులకు దరఖాస్తులు ఆహ్వానించగా మొత్తం 12591 మంది అప్లై చేసుకున్నారని చెప్పారు. జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు పూర్తి స్థాయిలో సిబ్బందిని అందుబాటులోకి తెచ్చి అత్యంత పారదర్శకంగా వడ పోత ప్రక్రియ జరుగుతుందని తెలిపారు. అనంతరం ప్రోవిషనల్ జాబితా ఆన్లైన్‌లో ఉంచుతామని, అభ్యర్థులు జాబితాలో తమకు వచ్చిన పాయింట్లు సరి చూసుకొని అభ్యంతరాలతో ఆఫీస్‌ను సంప్రదించాలని కోరారు. అనంతరం మాత్రమే మెరిట్ జాబితా ప్రకారం మాత్రమే నియామక ప్రక్రియ వుంటుందన్నారు. అయితే ఇటీవల కొందరు మధ్యవర్తులు, దళారులు మోసపు మాటలు చెప్పి నిరుద్యోగులను ప్రలోభాలకు గురి చేస్తున్నారన్న విషయం తమ దష్టికి వచ్చిందని, ఇలాంటి మోసపు మాటలు నమ్మి మోసపోవద్దని, ప్రక్రియ ఆద్యంతం మెరిట్ ఆధారంగా మాత్రమే జరుగుతుందని వెల్లడించారు. విలేకరుల సమావేశంలో ఏడీ విజయలక్ష్మి, ఏఓ ప్రకాశరావు, సూపరింటెండెంట్ శ్రీనివాసరావు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే ఏలూరిని అరెస్ట్ చేయాలి

వైసిపి పర్చూరు ఇన్‌ఛార్జి ఆమంచి

ప్రజాశక్తి-మార్టూరు రూరల్

అక్రమ మార్గంలో గ్రానైట్ తరలిస్తున్న పరిశ్రమలపై మైనింగ్ శాఖకు చెందిన అధికారులు తనిఖీలు చేస్తుండగా వారిని నిర్బంధించి దాడికి యత్నించిన పర్చూరు శాసనసభ్యులు ఏలూరి సాంబశివరావును, అతని అనుచారులను వెంటనే అరెస్ట్ చేయాలని మాజీ శాసనసభ్యులు, పర్చూరు వైసిపి ఇన్‌ఛార్జి ఆమంచి కష్ణమోహన్ అన్నారు. బుధవారం మార్టూరు కొణిదెన రోడ్డులోని మార్కెట్ యార్డ్‌లో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. తాను పర్చూరు నియోజకవర్గ బాధ్యతలు చేపట్టిన నాటి నుండి గ్రానైట్ వ్యాపారుల దగ్గర అక్రమ వసూళ్లకు తెరలేపానని రెండు చెంచా పత్రికల ద్వారా వరుస కథనాలు ప్రచురిస్తున్నారని, సిగ్గు లేని ఆ రెండు దినపత్రికలకు, అందులో రాసే రాతగాళ్లకు తెలియదా? అని ధ్వజమెత్తారు. కార్యక్రమంలో వక్ఫ్ బోర్డు జిల్లా కార్యదర్శి గడ్డం మస్తాన్‌వలీ, చెంగలయ్య, పాల్గొన్నారు.

యుటిఎఫ్ కార్యాలయానికి సౌండ్ సిస్టమ్ అందజేత

సౌండ్ సిస్టమ్ అందజేస్తున్న మంత్రి నాగార్జున, బూచేపల్లి

ప్రజాశక్తి-చీమకుర్తి

స్థానిక దాచూరి రామిరెడ్డి భవనం (యుటిఎఫ్) కార్యాలయానికి జెవివి జిల్లా గౌరవాధ్యక్షులు, లయన్స్ క్లబ్ వ్యవస్థాపక అధ్యక్షులు డాక్టర్ బి.జవహర్ రూ.38 వేల విలువైన స్టీరియో మైక్ సౌండ్ సిస్టమ్ అందజేశారు. స్థానిక జవహర్ నర్సింగ్ హోమ్‌లో ఏర్పాటుచేసిన కార్యక్రమంలో రాష్ట్ర మంత్రి మేరుగు నాగార్జున, జిల్లా పరిషత్ ఛైర్‌పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ, మాజీ ఎమ్మెల్యే బూచేపల్లి శివప్రసాదరెడ్డి చేతుల మీదుగా అందజేశారు. కార్యక్రమంలో జడ్‌పిటిసి వేమా శ్రీను, మద్దిపాడు ఏఎంసి మాజీ ఛైర్మన్ మారం వెంకారెడ్డి, లయన్స్ గవర్నర్ కృపానందం, యుటిఎఫ్ జిల్లా కార్యదర్శి నల్లూరి వెంకటేశ్వరరావు, యుటిఎఫ్ మండల అధ్యక్ష, కార్యదర్శులు ఎస్‌కె.అక్బర్, చలువాది శ్రీనివాసరావు, ఉపాధ్యక్షులు జి.వెంకటేశ్వర్లు, కోశాధికారి పర్వతం వెంకటేశ్వర్లు, జిల్లా నాయకులు ఎస్‌కె.శిలార్, బి.వసంతరావు, పి.భాస్కర్, చాట్ల శ్రీను, ఎన్.రాఘవరామ, వీరారెడ్డి, జెవివి రాష్ట్ర నాయకులు కె.సుబ్రహ్మణ్యాచారి, చల్లా శ్రీను పాల్గొన్నారు.

బీసీ భవనాల నిర్మాణాన్ని అడ్డుకున్న ప్రభుత్వం

ప్రజాశక్తి- కొమరోలు

టిడిపి హయాంలో బీసీల సంక్షేమం కోసం నియోజకవర్గ పరిధిలోని మండల కేంద్రాల్లో చేపట్టిన బీసీ భవనాల నిర్మాణాలను జగన్‌రెడ్డి ప్రభుత్వం అడ్డుకున్నట్లు టిడిపి నియోజక వర్గ ఇన్‌ఛార్జి ముత్తుముల అశోక్‌రెడ్డి తెలిపారు. కొమరోలు మండలం తాటిచెర్ల పంచాయతీ పరిధిలోని నాగిరెడ్డి పల్లె గ్రామం టిడిపి మండల అధ్యక్షుడు బోనేని వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో జయహో బీసీ సభ బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా అశోక్ రెడ్డి మాట్లాడుతూ ప్రజా వ్యతిరేక విధానాలను అమలు చేస్తున్న వైసిపి ప్రభుత్వానికి వచ్చే ఎన్నికల్లో తగిన గుణపాఠం చెప్పాలన్నారు. అనంతరం నాగిరెడ్డి పల్లె గ్రామంలోని బీసీ సోదరులతో సమావేశం నిర్వహించారు. కార్యక్రమంలో మండల అధ్యక్షులు బోనేని వెంకటేశ్వర్లు యాదవ్, మాజీ ఎంపిటిసి బోనేని జయలక్ష్మి, నాగిరెడ్డి పల్లె బీసీ నాయకులు పందనబోయిన భూపాల్ యాదవ్, బాలరాజు, ఆవులయ్య, వీర శేఖర్, గోపాల్, బాలకష్ణ, కళ్యాణ్, రాజా, శ్రీను, మహేష్, తిరుమలయ్య, రామరాజు, అనిల్, మాజీ ఎంపిటిసి ముత్తుముల సంజీవ రెడ్డి, మాజీ సర్పంచి షేక్ అబ్దుల్ ఖాదర్, షేక్ హసీనా పాల్గొన్నారు.

మాట్లాడుతున్న అశోక్‌రెడ్డి

పేదవాళ్లు బాగుండాలంటే

టిడిపి ప్రభుత్వం రావాలి

నారా భువనేశ్వరి

ప్రజాశక్తి-కొండపి

రాష్ట్రంలో ప్రతి పేదవాడూ బాగుండాలంటే తెలుగుదేశం పార్టీ అధికారంలోకి రావాలని టిడిపి అధినేత, నారా చంద్రబాబునాయుడు సతీమణి నారా భువనేశ్వరి పేర్కొన్నారు. బుధవారం 'నిజం గెలవాలి' కార్యక్రమంలో భాగంగా కొండపి మండలంలోని కె.ఉప్పలపాడు గ్రామంలో నారా చంద్రబాబునాయుడు అక్రమ అరెస్టు నేపథ్యంలో మనస్తాపంతో మృతిచెందిన జంకాల అంజయ్య కుటుంబాన్ని భువనేశ్వరి పరామర్శించారు. అంజయ్య భార్య అజంతకు రూ.3 లక్షల చెక్కును అందచేశారు. ఈ సందర్భంగా భువనేశ్వరి మాట్లాడుతూ దామచర్ల కుటుంబం సహాయ సహకారాలతో కొండపి నియోజకవర్గంలో ఎమ్మెల్యే స్వామిని మూడో సారి కూడా గెలిపించుకోవాలని కోరారు. కార్యక్రమంలో కొండపి శాసనసభ్యులు డాక్టర్ డోలా శ్రీ బాలవీరాంజనేయస్వామి, జిల్లా నాయకులు నూకసాని బాలాజీ, రాష్ట్ర కార్యనిర్వహక కార్యదర్శి దామచర్ల సత్య పాల్గొన్నారు.

టంగుటూరులో ప్రజలకు అభివాదం చేస్తున్న భువనేశ్వరి

కుమ్మరాజు కుటుంబానికి చేయూత నందిస్తా...

కొండపిలోని టంగుటూరు రోడ్డులో ఉన్న హెరిటేజ్ పాల డెయిరీలో సెక్యూరిటీ గార్డుగా పనిచేసిన పరాగ కుమ్మరాజు కుటుంబానికి చేయూతనందిస్తానని నారా భువనేశ్వరి హామీ ఇచ్చారు. కుమ్మరాజు హెరిటేజ్ పాల డెయిరీలో వాచ్‌మెన్‌గా విదులు నిర్వహిస్తుండగా గత కొన్ని క్రితం పిడుగుపాటుకు మృతి చెందాడు. బుధవారం కె.ఉప్పలపాడులో కుమ్మరాజు కుటుంబం భువనేశ్వరిని కలవగా.. కుమ్మరాజు కుమారుడు, కుమార్తెలను చదివిస్తానని, కుమ్మరాజు భార్యకు హెరిటేజ్‌లో ఉద్యోగంతో పాటు పింఛన్ సౌకర్యం కల్పిస్తానని హామీ ఇచ్చారు.

దర్శి: దర్శి, ముండ్లమూరు మండలంలో సింగన్నపాలెం, తాళ్లూరు మండలం తూర్పు గంగవరం గ్రామాల్లో భువనేశ్వరి పర్యటించి..బాధిత కుటుంబాలను రూ.3 లక్షల చొప్పున చెక్కు అందజేశారు. భువనేశ్వరి వెంట ఎమ్మెల్సీ అనురాధ, మాజీ ఎమ్మెల్యే దామచర్ల జనార్ధన్, మాజీ ఎమ్మెల్యేలు నారపుశెట్టి పాపారావు, పార్లమెంటు అధ్యక్షులు నూకసాని బాలాజీ, నియోజకవర్గ నాయకులు గోరంట్ల రవికుమార్, విజయ్‌కుమార్‌తో పాటు జనసేన ఇన్‌ఛార్జీ బొటుకు రమేష్, దర్శి నియోజకవర్గ జనసేన నాయకులు గరికపాటి వెంకట్, నగర పంచాయతీ ఛైర్మన్ నారపుశెట్టి పిచ్చయ్య పాల్గొన్నారు.

టంగుటూరు: అరాచక ప్రభుత్వానికి రోజులు దగ్గర పడ్డాయని కొండపి ఎమ్మెల్యే డాక్టర్ డోలా శ్రీ బాల వీరాంజనేయ స్వామి, ఒంగోలు పార్లమెంట్ టీడీపీ అధ్యక్షులు నూకసాని బాలాజీ, దామచర్ల జనార్ధన్, దామచర్ల సత్య తదితరులు వైసీపీ ప్రభుత్వం పై నిప్పులు చెరిగారు. బుధవారం సాయంత్రం నారా భువనేశ్వరి "నిజం గెలవాలి" కార్యక్రమంలో భాగంగా టంగుటూరుకు విచ్చేసి దుగ్గినేని అరుణ్ కుమార్ కుటుంబసభ్యులను పరామర్శించారు. బాధిత కుటుంబానికి రూ.3 లక్షల చెక్కును అందజేశారు. కార్యక్రమంలో కొండపి శాసనసభ్యులు డాక్టర్ డోలా శ్రీ బాల వీరాంజనేయ స్వామి తోపాటు, టిడిపి ఒంగోలు పార్లమెంటు అధ్యక్షులు నూకసాని బాలాజీ, మాజీ ఎమ్మెల్యే దామచర్ల జనార్దన్, టిడిపి రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి దామచర్ల సత్య పాల్గొన్నారు.

సువర్ణమాల మృతికి ఎస్ఐ కారణం

కాదశీకుల అసోసియేషన్

సువర్ణమాల (ఫైల్)

ప్రజాశక్తి - వేటపాలెం

ఐద్వా నాయకురాలు సువర్ణమాల మృతికి ఎస్ఐ సురేష్ కారణమని కాదశీకు ల అసోసియేషన్ గౌరవాధ్య క్షులు పి కొండయ్య, అసోసి యేషన్ అధ్యక్ష, కార్యదర్శులు సత్యవేలు, శివనాడియన్, తమిళ కాలనీవాసులు ఆరోపించారు. 3రోజుల క్రితం సిలోన కాలనీ సమీపాన గల కాలనీకి చెందిన స్థలంలో కరెంట్ ఆఫీస్ వాచ్మెన్ రామకృష్ణారెడ్డి కూరగాయల అక్రమ సాగు ను కాలనీవాసులు అడ్డుకున్నారు. అంతకు ముందు రోజే తహశీల్దారు అశోకవర్ధన్ అక్కడ సాగు చేయవద్దని కాలనీకి వచ్చి మరీ హెచ్చరించారు. అయినప్పటికీ కాలనీ స్థలంలో సాగు కొనసాగించడంతో వివాదం చోటు చేసుకుంది. కాలనీవాసులు భయపెట్టేందుకు మందు తాగినట్లు ఆసుపత్రిలో చేరాడని, దీనిపై కేసు నమోదు చేసి కాలనీ వాసులను పోలీసులు భయ భ్రాంతులకు గురిచేయడం మొదలు పెట్టారని పేర్కొన్నారు. దీనిపై వైసిపి ఇన్ చార్జి కరణం వెంకటేష్‌ను కాలనీ వాసులు కలిశారు. వెంటనే వెంకటేష్ ఎస్ఐ సురేష్‌కు స్పీకర్ ఆన్ చేసి ఫోనులో మాట్లా డారు. కృష్ణారెడ్ పరిస్థితి బాగాలేదని, ఐసియులో ఉన్నాడని, అందువల్ల కాలనీ వాసులు కొందరు అరెస్ట్ చేయాలని తీవ్రంగా చెప్పడంతో పరిస్థితి వివరించడానికి వెళ్లిన మహిళా నాయకులు సువర్ణమాల ఆందోళనకు గురై అక్కడికక్కడే కుప్పకూలిపోయారని తెలిపారు. వెంటనే అక్కడి నుండి ఆమెను గోరంట్ల ఆసు పత్రికి తరలించగా పరిస్థితి విషమించడంతో గుంటూరు జిజిహెచ్‌కి వెంకటేష్ బాబు స్వయంగా మెరుగైన వైద్యం కోసం రెకమెండ్ చేశారని అన్నారు. రాత్రి మూడు గంటల సమయంలో ఆమె మరణించారు. కాగా రామకృష్ణారెడ్డి ఇం టికి ఆసుపత్రికి తిరుగుతున్నాడని చూసిన ప్రత్యక్ష సాక్షులు చెప్పారని తెలిపారు. మూడు నెలలుగా తహశీల్దారు, ఆర్డీఓ, ఎమ్మెల్యేకి కాలనీవాసులు వినతి పత్రాలు ఇచ్చి తమ కాలనీ స్థలాన్ని సర్వే చేయమని కోరుతున్నారని, రామ కృష్ణారెడ్డి స్థలంలోకి వచ్చిన తమ కోళ్లను కాళ్లు ఇరగ్గొట్టి చంపి పూడ్చి పెట్టారని, అతని మితిమీరిన చర్యల వల్ల ఈ పరిణామాలన్నీ జరిగాయని పేర్కొన్నారు. దీనిపై ఉన్నత తాధికారులకు ఫిర్యాదు చేస్తామని చెప్పారు. కాలనీలో గురువారం అంత్యక్రియలు జరుగుతాయని తెలిపారు. ఈ ఘటనపై ఎస్సై జి సురేష్‌ను ప్రజాశక్తి వివరణ కోరగా రామకృష్ణారెడ్డి అనే వ్యక్తి ఇంటిపైకి కాలనీవాసులు దొమ్మికి వెళ్లారని ఫిర్యాదు ఇవ్వటంతో కేసు నమోదు చేశామని తెలిపారు. దీనిపై వైసిపి ఇన్‌ఛార్జి ఫోన్లో అడిగితే బదులిచ్చానని, ఈ ఘటనతో తనకు ఎలాంటి సంబంధం లేదని తెలిపారు.

టిడిపి సమావేశంలో టైనీ ఎన్ రామకృష్ణ

సంక్షేమ పథకాలపై అవగాహన

ప్రజాశక్తి - కొల్లూరు

టిడిపి ఎన్నికల మేనిఫెస్టోలోని ఆరు సంక్షేమ పథకాలపై క్లస్టర్ యూనిట్ బూత్ సభ్యులు, టిడిపి మండల అధ్యక్షులు, కుటుంబ సాధికార సారధులు ఇంటింటికి తిరిగి ఆరు పథకాలపై అవగాహన కల్పించాలని టిడిపి ట్రైనీ ఎన్ రామకృష్ణ తెలిపారు. స్థానిక ఎంప్లాయిస్ క్రియేషన్ క్లబ్‌లో బుధవారం బూతు నిర్వాహకులు, క్లస్టర్ యూనిట్ సభ్యులతో జరిగిన శిక్షణ శిబిరంలో ఆయన మాట్లాడారు. ఎన్నికల కమిషనర్ విడుదల చేసిన 2024ఓటర్ల తుది జాబితాను క్షుణ్ణంగా పరిశీలించాలని అన్నారు. 80ఏళ్ల దాటిన వృద్ధులకు ఫారం 12ను ముందుగా దరఖాస్తు చేయాలని కోరారు. గ్రామంలో ఇంటింటికి తిరిగి బాబు షురిటీ, భవిష్యత్ గ్యారెంటీ అంశాలను ప్రచారం చేయాలని కోరారు. కార్యక్రమంలో టిడిపి మండల అధ్యక్షులు మైనేని మురళీకృష్ణ, ఐటిడిపి కోఆర్డినేటర్ మానం రమేష్, ఎడ్ల శ్రీనివాస్ పాల్గొన్నారు.

కౌన్సిల్ సమావేశంలో మున్సిపల్ ఛైర్మన్

అభివృద్ధి పనులకు ఆమోదం

ప్రజాశక్తి - రేపల్లె

పట్టణంలో వివిధ రకాల అభివృద్ధి పనులకు మున్సిపల్ కౌన్సిల్ ఏకగ్రీవంగా ఆమోదం తెలిపింది. స్థానిక కౌన్సిల్ హాలులో కౌన్సిల్ సాధారణ సమావేశం బుధవారం నిర్వహించారు. 35అంశాలతో కూడిన అజెండాను ఆమో దించారు. వైస్ ఛైర్మన్ జి ప్రశాంత్ కుమార్ మాట్లాడుతూ పట్టణంలో అభివృద్ధి పనుల కోసం రూ.15.50 లక్షలు కేటాయించినట్లు తెలిపారు. పారిశుధ్య పనులకు రూ.4.50 లక్షలు, కార్మికుల యూనిఫాంకు రూ.లక్ష, కొబ్బరినూనె, సబ్బుల పంపిణీకి రూ.3లక్షలు కేటాయించినట్లు చెప్పారు. డ్రైనేజీ నిర్మాణానికి రూ.5లక్షలు, వాటర్ వర్క్స్ కు రూ.లక్ష, పార్కుల అభివృద్ధికి రూ.లక్ష వెచ్చించినట్లు తెలిపారు. సమావేశంలో వైస్ ఛైర్మన్-2 విశ్వనాథ గుప్తా, కమిషనర్ టి రాంభూపాల్‌రెడ్డి పాల్గొన్నారు.

సమస్యలను సత్వరమే పరిష్కరించాలి

ప్రజాశక్తి - నిజాంపట్నం

ప్రజల సమస్యలను సత్వరమే పరిష్కరించే దిశగా చర్యలు తీసుకోవాలని ఎంపిపి మోపిదేవి విజయనిర్మల, వెంకట హరినాథ్ బాబు అధికారులను కోరారు. స్థానిక మండల ప్రజాపరిషత్ కార్యాలయంలో బుధవారం సర్వసభ్య సమావేశం నిర్వహించారు. అధికారులు ప్రజలకు అందుబాటులో ఉండి ప్రజా సమస్యలను సత్వరమే పరిష్కరించాలని అన్నారు. గ్రామాల్లో త్రాగునీటి సమస్య ఉందని, త్వరలోనే చెరువులకు త్రాగునీటిని వదలాలని అధికారులను ఆదేశించారు. విద్యుత్ సమస్యలను చాలా వరకు పూర్తి చేసినట్లు తెలిపారు. ఇంకా ఉన్న విద్యుత్ సమస్యలను త్వరితగతిన పూర్తి చేయాలని అధికారులు ఆదేశించారు. డ్రైనేజీ సమస్యలు కూడా పిల్ల కాలువ పూడికలను తీయడానికి అనుమతి వచ్చిందని అన్నారు. ఆ పనులూ త్వరలో మొదలుపెడతామని తెలిపారు. ఎటువంటి సమస్యలున్నా తమ దృష్టికి తీసుకువస్తే పరిష్కరించే దిశగా చర్యలు తీసుకుంటామని తెలిపారు. సర్పంచులు, ఎంపిటిసిలు తమ గ్రామాల్లోని సమస్యలు పరిష్కరించుకుని ప్రజాదరణ పొందాలని కోరారు. అనంతరం బదిలీపై వెళుతున్న ఎంపిడిఒ ఎన్ నాగలక్ష్మిని షాలువాతో సత్కరించారు. కార్యక్రమంలో తహశీల్దారు నెహ్రూ బాబు, వైస్ ఎంపిపి తోటకూర సుబ్బారావు, కూచినపూడి ఎఎంసి ఛైర్మన్ పందరబోయిన బసవ పున్నారావు పాల్గొన్నారు.

అర్జీలు సత్వరమే పరిష్కరించాలి

ప్రజాశక్తి- సంతమాగులూరు

స్పందనలో సమస్యలు వింటున్న కలెక్టర్ రంజిత్ భాష

స్పందనలో వచ్చిన అర్జీలను అధికారులు సత్వరమే పరిష్కరించాలని కలెక్టర్ పి రంజిత్ భాష సూచించారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయం ఆవరణలో జగనన్నకు చెబుదాం స్పందన బుధవారం నిర్వహించారు. చీరాల ఆర్డీఒ సరోజిని అధ్యక్షత వహించారు. ప్రజల నుండి 34అర్జీలను స్వీకరించారు. కొమ్మాలపాడు గ్రామానికి చెందిన రైతులు గత కొన్నేళ్లుగా సాగు చేస్తున్న అగ్రహారం భూములకు సాగు పట్టాలు ఇవ్వాలని కోరారు. కొప్పరం, బండివారిపాలెం పంచాయతీల పరిధిలోని నెహ్రూ నగర్ కాలనీ వద్ద రైతులు సాగు చేసుకుంటున్న కలెక్టివ్ ఫార్ములా సొసైటీ భూములకు పట్టాలు ఇవ్వాలని రైతులు కోరారు. రెవిన్యూ సమస్యలపై 16అర్జీలు, మండల పరిషత్ పరిధిలో 7అర్జీలు, పోలీస్ కేసులపై ఒకరు, చేనేత సమస్యలపై ముగ్గురు, విద్యుత్ సమస్యలపై ఇద్దరు, పంచాయతీరాజ్ నుండి 3అర్జీలు, గృహం మంజూరుకై ఒకరు, దేవాదాయ శాఖ పరిధిలో ఒకరు వినతి పత్రాలు అందజేశారు. కార్యక్రమంలో వైసీపీ ఇన్‌చార్జి పానెం హనిమిరెడ్డి, జడ్పిటిసి అడవి శ్రీనివాసరావు, ఎంపీపీ వై ఎలమంద, తహశీల్దారు టీ ప్రశాంతి, ఎంపీడీఓ ఎన్ శివరామప్రసాద్ పాల్గొన్నారు.

ఉపాధ్యాయుడు దుర్గాప్రసాద్ దంపతులకు సన్మానం

అంకితభావంతో పనిచేసిన దుర్గాప్రసాద్

ప్రజాశక్తి - వేటపాలెం

ఉపాధ్యాయ వృత్తిలో 38ఏల్లు అంకితభావంతో పింజల దుర్గాప్రసాద్ ఉపాధ్యాయునిగా సేవలు అందించారని పలువురు కొనియాడారు. మండలంలోని వేటపాలెం జెడ్పి హై స్కూల్ నందు పెంజల దుర్గాప్రసాద్ ఉద్యోగ విరమణ సందర్భంగా వీడ్కోలు సభ ఏర్పాటు చేశారు. సభలో ఆయన సేవలను డిప్యూటీ డిఇఓ రమేష్ బాబు అభినందించారు. కార్యక్రమంలో ఎంఇఓ ఎవి వెంకట సుబ్బయ్య, పందిళ్లపల్లి హెచ్ఎం భట్టిప్రోలు వెంకటేశ్వర్లు, యుటిఎఫ్, ఏపిటిఎఫ్ సంఘాల నాయకులు పాల్గొన్నారు.

క్రమం తప్పకుండా వ్యాయామం చేయాలి

ప్రజాశక్తి - చీరాల

వైద్యపరీక్షలు చేస్తున్న డాక్టర్ నవీన్‌కుమార్

షుగర్ బాధితులు తప్పనిసరిగా ఆహార నియమాలు పాటిస్తూ, వ్యాయామం చేయాలని, ఏడాదికి ఒకసారి గుండె, కళ్ళు, కిడ్నీ పరీక్షలు చేయించుకోవాలని, క్రమం తప్పకుండా మందులు వాడాలని షుగర్ స్పెషలిస్ట్ డాక్టర్ జి నవీన్ కుమార్ అన్నారు. రోటరీ క్లబ్ సహకారంతో శ్రీ కామాక్షి కేర్ హాస్పిటల్ నందు షుగర్, గుండె, రెటీనా సమ స్యలపై ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. ఈ వైద్య శిబిరంలో గుండె స్పెషలిస్ట్ డాక్టర్ కొసరాజు కమలాకర్, షుగర్, జనరల్ ఫిజీషియన్ డాక్టర్ నవీన్ కుమార్, సీనియర్ ఆత్మలిక్ ఆఫీసర్ తాడివలస కుమార్ వైద్య సేవ లు చేశారు. వైద్య శిబిరంలో 86మంది ఉచితంగా రక్త పరీక్షలు, ఈసీజీ, గుండె పరీక్షలు, అవసరమైన వారికి మందులు అందజేశారు. డాక్టర్ వైఎస్సార్ ఆరోగ్యశ్రీ ద్వారా అన్ని రకాల ఆపరేషన్లు ఉచితంగా చేస్తారని హాస్పిటల్ మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ తాడివలస దేవరాజు తెలిపారు. వైద్య శిబిరంలో రోటరీ ప్రెసిడెంట్ నన్నపనేని రామకృష్ణ, నాగమల్లేశ్వరరావు, హాస్పిటల్ జనరల్ మేనేజర్ తాడివలస సురేష్ పాల్గొన్నారు.

సభలో సైన్సు ఉపాధ్యాయులు చిలుకూరి హనుమంతరావు

అవగాహనతో కూడిన చదువు అవసరం

ప్రజాశక్తి - ఇంకొల్లు రూరల్

మేడూరి సత్యనారాయణ రచన విద్య, అనుభవాలు, భావాలు గ్రంథాన్ని ఎంఇఓ పివి రాఘవరావు బుధవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సత్యనారాయణ రచించటం చాలా సంతోషం అన్నారు. బోధనలో ఆయన పొందిన అనుభవాలను గ్రంథంలో ఉంచారని అన్నారు. ఎంఇఓ ఎ శ్రీనివాసరావు మాట్లాడుతూ సత్యనారాయణ ప్రయోగశాలల అభివృద్ధికి కృషి చేశారని అన్నారు. సభకు బాలికోన్నత పాఠశాల హెచ్ఎం ఉదయ కుమారి అధ్యక్షత వహించారు. పావులూరు జెడ్పి ఉన్నత పాఠశాల సైన్స్ ఉపాధ్యాయులు చిలుకూరి శ్రీనివాసరావు గ్రంథ సమీక్ష చేశారు. వక్తలు మెరికనపల్లి సత్యనారాయణ, రావి నాగేశ్వరి, కరి కమలేశ్వరరావు, ఆవుల హనుమంతరావు తమ అనుభవాలను వివరించారు. కార్యక్రమంలో విశ్రాంత హెచ్ఎం ఆవుల హనుమంతరావు, రోటరీ క్లబ్ అధ్యక్షులు కరి కమలేశ్వరరావు, రావి నాగేశ్వరి, నాగిరెడ్డి పాల్గొన్నారు.

4న మెగా ఉచిత వైద్యశిబిరం

ప్రజాశక్తి - బాపట్ల

గోడప్రతులు ఆవిష్కరిస్తున్న వైద్యులు, నరేంద్రవర్మ

గ్రామీణ ప్రాంత ప్రజలకు సూపర్ స్పెషాలిటీ వైద్య సేవలు ఉచితంగా అందించేందుకు వేగేశన ఫౌండేషన్, రమేష్ హాస్పిటల్స్ సంయుక్తంగా ఈ నెల 4న బాపట్ల టౌన్ హాల్ ప్రాంగణంలో ఉచిత మెగా వైద్య శిబిరం నిర్వహిస్తున్నట్లు టిడిపి ఇన్‌ఛార్జి వేగేశన నరేంద్ర వర్మ అన్నారు. రమేష్ హాస్పిటల్స్ వైద్యులతో కలిసి టిడిపి కార్యాలయం ఏర్పాటు చేసిన విలేఖుల సమావేశంలో మాట్లాడారు. వైద్య నిపుణులు పర్యవేక్షణలో వైద్య పరీక్షలు నిర్వహించి అవసరమైన వారికి మందులు అందజేస్తారని తెలిపారు. రమేష్ హాస్పిటల్స్ డిప్యూటీ జనరల్ మేనేజర్ రాయపాటి మమత మాట్లాడుతూ ఉచిత వైద్య శిబిరంలో గుండె వైద్య నిపుణులు డాక్టర్ ఎల్ రామారావు, నరాలు, వెన్నెముక, శస్త్ర చికిత్స వైద్య నిపుణులు డాక్టర్ అరుణ్ కుమార్, ప్రసూతి వైద్య నిపు ణులు డాక్టర్ భాను తేజ, ఊపిరితిత్తులు, శ్వాసకోశ వైద్య నిపుణులు డాక్టర్ బాల భాస్కరరావు, బిపి, షుగర్ జనరల్ వైద్యనిపుణులు సుభ, గ్యాస్, లివర్ సమస్యల వైద్య నిపుణులు డాక్టర్ లోకేష్, వైరస్ వ్యాధుల వైద్యనిపుణులు నిరేన్ వైద్య సేవలు అందిస్తారని తెలిపారు. ఉచిత మెగా వైద్య సేవలు వినియోగించుకోవాలని కోరారు. ఉచిత మెగా వైద్య శిబిరం గోడ ప్రతులను ఆవిష్కరించారు. సమావేశంలో ఆసుపత్రి ప్రతినిధులు యలవర్తి కార్తీక్, రమేష్ హాస్పిటల్ సిబ్బంది పాల్గొన్నారు.

కోడి పందేల స్థావరాలపై దాడి

ప్రజాశక్తి - భట్టిప్రోలు

మండలంలోని వెల్లటూరు చెన్నకేశవ కాలనీలో బుధవారం సాయంత్రం కోడి పందాలు నిర్వహిస్తున్న సమాచారంతో ఎస్ఐ అంబటి చంద్రశేఖర్ ఆధ్వర్యంలో మెరుపు దాడి చేశారు. ఈ ఘటనలో రూ.4,060నగదు, రెండు కోడ పుంజులు, ముగ్గురు వ్యక్తులను అదుపులోకి తీసుకున్నట్లు ఎస్ఐ తెలిపారు. పోలీసులపై పందెం రాయుళ్ళు ఎదురు తిరిగినట్లు సమాచారం. అక్రమంగా పందాలు వేయడమే కాక పోలీసులపై తిరగబడిన ముగ్గురు వ్యక్తులను అదుపులోకి తీసుకుని కేసు నమోదు చేసినట్లు తెలిపింది.

ఎంపీడీఓ రామాంజనేయులును సన్మానిస్తున్న సిబ్బంది

అధికారులకు సన్మానం

ప్రజాశక్తి - పంగులూరు

ఎంపీడీఓగా పని చేస్తున్న బి రామాంజనేయులు నెల్లూరు జిల్లాకు బదిలీ అయ్యారు. మండల పరిషత్ కార్యాలయ అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ తానికొండ రమేష్‌కు బాధితులు అప్పగించి బదిలీపై వెళ్లారు. మండలానికి మరో 2రోజుల్లో కొత్త ఎంపీడీఓ రానున్నట్లు సిబ్బంది తెలిపారు. ఇక్కడి నుండి బదిలీ అయిన రామాంజనేయులు గత సంవత్సరం ప్రకాశం జిల్లా ముండ్లమూరు మండలం నుండి ఇక్కడికి వచ్చారు. ఆయనకు కార్యాలయ సిబ్బంది వీడ్కోలు పలికారు.

వేటపాలెం : తహశీల్దారు అశోకవర్ధన్ పనిచేసిన అన్ని చోట్ల సంతోషం కలిగించారని పలువురు వక్తలు కొనియాడారు. స్థానిక తహశీల్దారు కార్యాలయంలో ఆయన ఉద్యోగ విరమణ సభ ఘనంగా నిర్వహించారు. పనిచేసిన ప్రతిచోట సహిద్యోగులు అందరూ సంతోషంగా ఉండే విధంగా పనితీరు కనబరిచేవారని అన్నారు. విధి నిర్వహణలో స్పష్టంగా ఉండేవారని అన్నారు. కార్యక్రమంలో చీరాల తహశీల్దారు జీవిగుంట ప్రభాకరరావు, డిపి మస్తానరావు, డాక్టర్ బాలరాజు, వైసిపి మండల అధ్యక్షుడు బొడ్డు సుబ్బారావు, ఆర్‌బికె చైర్మన్ పల్లపోలు శ్రీనివాసరావు, చీరాల డ్యూటీ తహశీల్దారు అర్జునరావు, ఎఓ ఐ కాశీవిశ్వనాదం పాల్గొన్నారు.

పంగులూరు : తహశీల్దారు ఇడువులపాటి పద్మావతి బదిలీ అయ్యారు. ఆమెను మచిలీపట్నం స్పెషల్ డిప్యూటీ కలెక్టర్‌గా బదిలీ చేస్తూ ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసింది. ఆమె గత నాలుగేళ్లుగా పనిచేస్తున్నారు. రేపు, ఎల్లుండిలోపు బదిలీ అవ్వచ్చని కార్యాలయం సిబ్బంది తెలిపారు. నూతన తహశీల్దారు ఎవరనేది ఇంకా తెలియలేదని చెప్పారు. ఆర్భాటాలకు పోకుండా ఆమె పనిచేశారు. అయితే రెవిన్యూ సమస్యలు పరిష్కరించలేక పోయిందనే విమర్శలు ఆమె ఎదుర్కొన్నారు.

ఇంకొల్లు రూరల్ : ఎంపిడిఓ కార్యాలయ ఎఓ జివి భానుప్రసాద్ సేవలు అభినందనీయమని ఎంపిపి బండారు అనూష రాజ్‌కుమార్ పేర్కొన్నారు. స్థానిక ఎంపిడిఓ కార్యాలయంలో జరిగిన భానుప్రసాద్ ఉద్యోగ విరమణ సభలో ఆమె మాట్లాడారు. సభకు ఎంపిడిఓ ఆర్‌వి రాజ్యలక్ష్మి అధ్యక్షత వహించారు. ఆయన సేవలను కొనియాడారు. అనంతరం భానుప్రసాద్ దంపతులను సత్కరించారు. కార్యక్రమంలో ఇఓపిఆర్‌డి ఎ శ్రీనివాసరావు పాల్గొన్నారు.

ఇంకొల్లు రూరల్ : ఆదర్శ ఉపాధ్యాయురాలు కరణం ఈశ్వరవాణి అని డిప్యూటి డిఇఓ ఆర్ శ్రీనివాసరావు న్నారు. ఇంకొల్లు మండలం దుద్దుకూరు ఆచార్య రంగా జెడ్‌పి ఉన్నత పాఠశాల హెచ్‌ఎంగా పని చేస్తూ ఉద్యోగ విరమణ చేస్తున్న ఆమెకు ఉద్యోగ విరమణ అభినందన సభ బుధవారం నిర్వహించారు. ఈశ్వరవాణి, కోటేశ్వరరావు దంపతులను సత్కరించారు. సభకు ఇన్‌చార్జి హెచ్‌ఎం ఎన్ శ్రీనివాసాచార్యులు అధ్యక్షత వహించారు. సభలో ఎంఇఓలు పి వీరరాఘవయ్య, ఎ శ్రీనివాసరావు, సర్పంచ్ ఎం శ్రీనివాసరావు, కోమటి బాలయ్య, రాయిణి తిరుపతి రాయుడు, హెచ్‌ఎంలు వి ఉదయకుమారి, ఎం సత్యనారాయణ, ఎన్ సమత, టి ఆదినారాయణ పాల్గొన్నారు.

చిన్నారిని ఆశీర్వదిస్తున్న బలరాం

చిన్నారికి బలరాం ఆశీర్వాదం

ప్రజాశక్తి - బల్లికురవ రూరల్

మండలంలోని కొప్పెరపాడు వైసిపి నాయకుడు మక్కిన రామారావు మనవడు వర్షిత్ జన్మదిన వేడుకల్లో అద్దంకి వైసిపి ఇంఛార్జి పానెం చిన్న హనిమిరెడ్డి, చీరాల ఎంఎల్‌ఎ కరణం బలరామకృష్ణమూర్తి హాజరై చిన్నారిని ఆశీర్వదించారు. కార్యక్రమంలో వైసిపి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

విద్యాశాఖ అధికారుల విచారణ

ప్రజాశక్తి - పర్చూరు

ప్రాంతీయ విద్యాభివృద్ధి సంఘం ఆధ్వర్యంలో నాలుగు శతాబ్దాల క్రితం ఏర్పాటు చేసిన భవనం అంజిరెడ్డి, తులాబందుల అర్జునయ్య జూనియర్ కళాశాల యాజమాన్యంలో కొంత మంది అవినీతికి పాల్పడ్డారని పాలక వర్గంలోని కొంతమంది సిఎం, ప్రిన్సిపల్ సెక్రెటరీ, కమిషనర్లకు ఫిర్యాదు చేయడంతో జిల్లా ఒకేషనల్ విద్యాశాఖ అధికారి పొదిలి ఎర్రయ్య స్థానిక కాలేజీలో బుధవారం విచారణ చేశారు. ఐటీసీ సంస్థ ఉచితంగా రూ.కోట్ల విలువ చేసే స్థలాన్ని ఈ ప్రాంత విద్యాభివృద్ధి కోసం ఉదారంగా ఇచ్చినట్లు పేర్కొన్నారు. ఉద్యోగాల కల్పనలో రూ.లక్షల అవినీతి జరిగిందని కాలేజీ పాలకవర్గ సభ్యులు ఫిర్యాదు చేయడంతో ముందస్తు నోటీసులు ఇచ్చి విచారణ చేపట్టారు. కళాశాల అధ్యాపకులు, అద్యాపకేతర సిబ్బంది ఎవరెవరు ఎప్పటి నుంచి ఉద్యోగ నిర్వహణలో ఉన్నారని వ్యక్తి గతంగా వివరాలు అడిగి తెలుసుకున్నారు. 2021 ఆగష్టు 17న కళాశాలను ప్రభుత్వం స్వాధీనం చేసుకుంటున్నట్లు జీఓ ఇచ్చారు. అయితే 2022జూన్ ఇకటిన ఉద్యోగాలను సృష్టించి వారివద్ద నుంచి స్థాయిని బట్టి డబ్బు వసూలు చేశారని ఫిర్యాదు దారులు చెప్పారు. కళాశాలను ప్రభుత్వం స్వాధీనం చేసుకున్న తర్వాత కూడా అనుమతి లేకుండా ప్రైవేటు వ్యక్తుల విగ్రహాలు పెట్టినట్లు దృష్టికి తీసుకువెళ్ళారు. కళాశాల పూర్వ విద్యార్థి రవితేజ కళాశాల్లో ఇప్పుటి వరకు జరిగిన తీరుతెన్నులు, ప్రస్తుతం జరుగుతున్న పరిస్తులపై ఫిర్యాదు అందజేశారు. మండలంలోని నూతలపాడు కళాశాలపై వచ్చిన ఫిర్యాదులపైన కూడా విచారణ పూర్తి చేశారు. ఈ ఫిర్యాదులపై విచారణలో వచ్చిన అంశాలను ఉన్నతాధి కారులకు నివేదిక అందజేస్తానని తెలిపారు.

ఫిర్యాదు చేస్తున్న కళాశాల పూర్వ విద్యార్థి

చదువుతోనే ఉన్నత భవిష్యత్తు

ప్రజాశక్తి - పర్చూరు

మండలంలోని నాగులపాలెం శ్రీ బాలయోగి బాలికల గురుకుల పాఠశాల్లో సీనియర్ సివిల్ జడ్జి కె ప్రశాంతి ఆధ్వర్యంలో వీది బాలల దినోత్సవం సందర్భంగా న్యాయ విజ్ఞాన సదస్సు బుధవారం నిర్వహించారు. సదస్సుకు పాఠశాల ప్రిన్సిపాల్ విశ్వరాణి అధ్యక్షత వహించారు. జడ్జి ప్రశాంతి మాట్లాడుతూ ఆడ, మగ బిడ్డలను సమంగా చూడాలని, వీధుల్లో ఎవరైనా చిన్నారులు కనిపిస్తే అధికారులకు సమాచారం ఇవ్వాలని అన్నారు. అలాంటి పిల్లలను తల్లి తండ్రుల చెంతకు చేర్చి ప్రభుత్వమే చదువు కొనేందుకు వసతి కల్పిస్తుందని చెప్పారు. చదువుకోవడం ద్వారానే ఉన్నత భవిష్యత్తు ఉంటుందని అన్నారు. మహిళా న్యాయవాది శ్రీరమణి మాట్లాడుతూ విద్యార్థినులు మంచి చెడులను గ్రహించి చదువుకొని ఉన్నత స్థితిలో ఉండాలని సూచించారు. పాఠశాల్లో అందుతున్న భోజన సదుపాయాలు, ప్రభుత్వం అందించే సౌకర్యాలను విద్యార్ధులను అడిగి తెలుసుకున్నారు.

న్యాయ విజ్ఞాన సదస్సులో సీనియర్ సివిల్ జడ్జి

సర్దార్ గౌతులచ్చన్న విగ్రహావిష్కరణ

ప్రజాశక్తి - వేమూరు

మండలంలోని బలిజపల్లి గ్రామంలో స్వతంత్ర సమరయోధులు సర్దార్ గౌతు లచ్చన్న విగ్రహాన్ని మాజీ మంత్రి నక్కా ఆనందబాబు, రేపల్లె ఎంఎల్‌ఎ అనగాని సత్యప్రసాద్ ఆవిష్కరించారు. గ్రామ ప్రధాన కూడలిలో ఏర్పాటు చేసిన లచ్చన్న విగ్రహాన్ని టిడిపి నాయకులు, గ్రామ పెద్దల సహకారంతో ఏర్పాటు చేయడం అభినందనీయమని అన్నారు. గౌత లచ్చన్న చేసిన సేవలు మరువలేనివని అన్నారు. లచ్చన్న ఆశయ సాధనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని అన్నారు. కార్యక్రమంలో టిడిపి నాయకులు, కార్యకర్తలు, గ్రామ పెద్దలు, విగ్రహ నిర్మాణ కమిటీ సభ్యులు ఉన్నారు.

గౌతులచ్చన్న విగ్రహ ఆవిష్కరిస్తున్న ఆనందబాబు, సత్యప్రసాద్

అనుమతులు లేని దుకాణాలకు నోటీసులు

ప్రజాశక్తి - వేటపాలెం

దుకాణదారులు లైసెన్సులు కలిగి ఉండటం తప్పనిసరని చీరాల ఫుడ్ ఇన్స్‌పెక్టర్ ప్రణీత్ కుమార్ తెలిపారు. మండలంలోని చల్లారెడ్డి పాలెం పంచాయితీ బీబీహెచ్ డిగ్రీ కాలేజీ ఎదురుగా ఉన్న దుకాణాల్లో ఆహార పదార్థాలను ఆయన బుధవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. అనుమతులు లేని 4 దుకాణాలను గుర్తించి యజమానులకు నోటీసులు జారీ చేశారు. వారం రోజుల్లో ప్రభుత్వ అనుమతులు తీసుకోవాలని సూచించారు. అనుమతులు లేకుండా ఆ తర్వాత దుకాణాలు కొనసాగిస్తే చట్టపరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు. ఆహార పదార్ధాల నాణ్యత పాటించాలని సూచించారు.

వేడుకల్లో మాజీ మంత్రి ఆనందబాబు

ప్రజాశక్తి - కొల్లూరు

మండలంలోని తాడిగిరిపాడు గ్రామానికి చెందిన పోతర్లంక నాగేశ్వరరావు కుమార్తె నిహారిక నూతన వస్త్ర వేడుకల్లో మాజీ మంత్రి నక్కా ఆనందబాబు హాజరై చిన్నారిని ఆశీర్వదించారు. కార్యక్రమంలో తెలుగు యువత అధికార ప్రతినిధి డాక్టర్ కనకాల మధుసూధన ప్రసాద్, చిన్న పులివర్రు కోటేశ్వరరావు పాల్గొన్నారు.

నూతన వస్త్ర బహుకరణ వేడుకల్లో మాజీ మంత్రి

రూ.2.5లక్షల విలువైన రేసింగ్ సైకిల్ బహుకరణ

ఉదారత్వం చాటుకున్న మోపర్తి

ప్రజాశక్తి - కర్లపాలెం

మండలంలోని చింతాయపాలెం హైస్కూలుకు రూ.2.50లక్షల విలువైన స్కాట్ ఇంటర్నేషనల్ రేసింగ్ సైకిల్‌ను బహుకరించినట్లు కేర్ స్వచ్ఛంద సంస్థ వ్యవస్థాపకులు మోపర్తి జాన్ తెలిపారు. ఇదే హైస్కూల్లో చదువుతున్న 8వ తరగతి విద్యార్థిని పిట్టు అనురాధరెడ్డి సైక్లింగ్‌లో ఇటీవల జాతీయస్థాయిలో బంగారు పతకం సాధించింది. సైక్లింగ్ పోటీలో మరి కొంతమంది విద్యార్థులు జాతీయ స్థాయికి ఎదిగేలా తమ సంస్థ తరపున రేసింగ్ సైకిల్ బహుకరించినట్లు తెలిపారు. తమ సంస్థ ద్వారా క్రీడాకారులకు చేయూత ఇచ్చేందుకు ఎప్పుడు సిద్ధంగా ఉంటామన్నారు. కార్యక్రమంలో కేర్ సంస్థ అధ్యక్షురాలు సృజన భారతి, మిషన్స్ డైరెక్టర్స్ స్టీవ్ కాలిన్స్, హై స్కూల్ ఇంచార్జ్ హెచ్‌ఎం పుష్పేంద్రరెడ్డి, పిఈటి ఎం గోపి, ఉపాధ్యాయులు పద్మ కుమారి, డేవిడ్, గోల్డ్ మెడల్ సాధించిన విద్యార్థిని తల్లిదండ్రులు పిట్టు సుబ్బారెడ్డి, నాగలక్ష్మి ఉన్నారు.

ప్రజలతో మాట్లాడుతున్న డాక్టర్ పాలేటి రామారావు

ఎన్నికల్లో పోటీ చేస్తా: పాలేటి

ప్రజాశక్తి - వేటపాలెం

మాజీ మంత్రి డాక్టర్ పాలేటి రామారావు మండలంలోని పాపాయిపాలెం గ్రామంలో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. గ్రామ పెద్దలతో సమావేశం అయ్యారు. గవిని పోతురాజు ఆధ్వర్యంలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ రానున్న సార్వత్రిక ఎన్నికల్లో తాను పోటీ చేస్తున్నట్లు చెప్పారు. పార్టీ టికెట్టు వస్తే పార్టీ తరఫున పోటీ చేస్తానని లేకపోతే స్వతంత్ర అభ్యర్థిగా పోటీ చేస్తానని తెలిపారు. స్పందించిన గ్రామ పెద్దలు ఎప్పటిలాగే తామంతా మీతోనే కలిసి ప్రయాణం చేస్తామని తెలిపారు. గ్రామంలోని వివిధ సమస్యలపై గ్రామస్తులతో చర్చించారు. రానున్న ఎన్నికల్లో నాయకులు ఎలా పని చేయాలనే విషయంపై పలు సలహాలు, సూచనలు చేశారు. సమస్యలపై గ్రామ పెద్దలతో చర్చించిన ఆయన వచ్చే ప్రభుత్వంలో సమస్యలు పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో బొమ్మిడి అచ్చయ్య, గొర్ల చక్రపాణి, గవిని శ్రీనివాసరావు, పులి కృష్ణమూర్తి బాబు, పులి తిరుపతిరావు, గవిని వేణు, పులి కృష్ణమూర్తి, ఆతిన వెంకటేశ్వర్లు, మల్లవరపు హనుమంతరావు, మద్దిన బాలరాజు పాల్గొన్నారు.

జెండా పండుగలు అభినందనీయం

ప్రజాశక్తి - వేమూరు

క్రైస్తవులు ప్రతి ఏటా జనవరి మాసంలో జెండా పండుగలు జరుపుకోవడం అభినందనీయమని మాజీ మంత్రి నక్కా ఆనందబాబు అన్నారు. అమర్తలూరు, వేమూరు మండల కేంద్రాల్లో బుధవారం జరిగిన జెండా పండుగలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా చర్చిలో ప్రత్యేక ప్రార్థనలు చేశారు. ఐక్యత, సామరస్యానికి నిదర్శనమే జెండా పండుగలని అన్నారు. కార్యక్రమంలో టిడిపి నాయకులు, పాస్టర్లు పాల్గొన్నారు.

చర్చిలో ప్రార్థనల్లో ఆనందబాబు

మాట్లాడుతున్న డివైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి కెఎఫ్.బాబు

డిఎస్‌సి పోస్టుల సంఖ్యను పెంచాలి

డివైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి కెఎఫ్.బాబు

ప్రజాశక్తి-ఒంగోలు కలెక్టరేట్

డిఎస్‌సి పోస్టుల సంఖ్యను పెంచి మెగా డిఎస్‌సి విడుదల చేయాలని డివైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి కెఎఫ్.బాబు డిమాండ్ చేశారు. డిఎస్‌సి ప్రతిపాదనని మంత్రి మండలి ఆమోదించడంపై ఆయన హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటుచేసిన సమావేశంలో కెఎఫ్ బాబు మాట్లాడుతూ గత నాలుగు సంవత్సరాల నుండి ఊరిస్తూ కేవలం 6100 పోస్టులను మాత్రమే భర్తీ చేస్తామని ప్రకటించడం సరికాదన్నారు. ఇప్పటికీ మెగా డిఎస్‌సి కోసం డివైఎఫ్ఐ అనేక రూపాల్లో ఆందోళన పోరాటాలు నిర్వహించిందన్నారు. చివరకు మంత్రి బొత్స సత్యనారాయణ ఇల్లు, సిఎం క్యాంప్ ఆఫీస్ ముట్టడించడం జరిగిందన్నారు. విజయవాడలో దీక్షలు కూడా చేశామని, ఈ సందర్భంగా వందలాది మందిపై ప్రభుత్వం అక్రమ కేసులు బనాయించిందని చెప్పారు. మెగా డిఎస్‌సి ప్రకటించలేదని ఆవేదన వ్యక్తం చేశారు. 25 వేల ఉపాధ్యాయ పోస్టులు ఖాళీగా ఉంటే కేవలం 6100 పోస్టుల భర్తీ చేస్తామనటం నిరుద్యోగులను మోసం చేయడమే అవుతుందన్నారు. నాలుగేళ్ల నుండి రాష్ట్రంలో 10 లక్షల మంది అభ్యర్థులు నోటిఫికేషన్ కోసం ఎదురుచూస్తున్నారని, రాష్ట్ర ప్రభుత్వం తక్షణమే మెగా డిఎస్‌సి ప్రకటించాలన్నారు. మెగా డిఎస్‌సి కోసం ఆందోళనలు కొనసాగుతాయని తెలిపారు. సమావేశంలో డివైఎఫ్ఐ నగర అధ్యక్షుడు పి. కిరణ్, నాయకులు పి.రాంబాబు, వి.కార్తీక్ పాల్గొన్నారు.

వికలాంగురాలికి కుట్టుమిషన్ అందజేత

ప్రజాశక్తి-ఒంగోలు కలెక్టరేట్

ఒంగోలు నగరానికి చెందిన వికలాంగురాలు రాగిణి పూర్ణిమకు రూ.10 వేలు విలువైన కుట్టు మిషన్‌ను కలెక్టర్ ఏఎస్ దినేష్ కుమార్ అందజేశారు. ఇందుకు అవసరమైన నిధులను దోస్తీ ఫౌండేషన్ కి చెందిన ఆంధ్రప్రదేశ్ మైనారిటీ ఫైనాన్స్ కార్పొరేషన్ డైరెక్టర్ షేక్ మహబూబ్ సమకూర్చారు. అంతర్జాతీయ వికలాంగుల దినోత్సవం సందర్భంగా పూర్ణిమ తన జీవనోపాధి నిమిత్తం కుట్టు మిషన్ ఇప్పించాల్సిందిగా కలెక్టర్‌కి విజ్ఞప్తి చేసింది. ఇందుకు స్పందించిన కలెక్టర్ ఈ విషయంలో తగిన చర్యలు తీసుకోవాల్సిందిగా వికలాంగులు, వయోవృద్ధుల సంక్షేమ శాఖ సహాయ సంచాలకులు అర్చన, మెప్మా టి.రవి కుమార్‌ను ఆదేశించారు. దీంతో సంబంధిత అధికారులు కార్పొరేషన్ డైరెక్టర్ షేక్ మహబూబ్ సంప్రదించి కుట్టు మిషన్ ఏర్పాటు చేశారు. ఈ కుట్టు మిషన్ ను బుధవారం కలెక్టరేట్ ప్రాంగణంలో కలెక్టర్ ఏఎస్ దినేష్ కుమార్ పూర్ణిమకు అందజేశారు.

కుట్టుమిషన్ అందజేస్తున్న కలెక్టర్

4న విజయవాడలో రాష్ట్ర మహాసభ

విజయవంతం చేయాలని గ్రామీణ వైద్యుల సంఘం పిలుపు

ప్రజాశక్తి -ఒంగోలు కలెక్టరేట్

ఆంధ్రప్రదేశ్ సామాజిక వైద్య సహాయకుల సంఘాల సమాఖ్య వార్షికోత్సవ రాష్ట్ర మహాసభ, క్యాన్సర్ అవగాహన సదస్సు ఈనెల 4న విజయవాడ కామినేని హాస్పిటల్ రోడ్డులోని అనుమోలు గార్డెన్స్‌లో జరుగుతుందని రూరల్ మెడికల్ ప్రాక్టీషనర్స్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు బట్టు బాలాజీరావు, కె.బాలచంద్ర ఓ సంయుక్త ప్రకటనలో తెలిపారు. కార్యక్రమంలో జన విజ్ఞాన వేదిక వ్యవస్థాపక అధ్యక్షులు, కమ్యూనిటీ పారామెడిక్స్ సిలబస్ సృష్టికర్త డాక్టర్ వి.బ్రహ్మారెడ్డి, కర్నూలు రెడ్‌క్రాస్ సొసైటీ ఛైర్మన్, గ్రామీణ వైద్యుల మహాసభ గౌరవాధ్యక్షులు డాక్టర్ కెజి గోవింద రెడ్డి, క్యాన్సర్ వైద్య నిపుణులు డాక్టర్ ఎం.గోపిచంద్, ఫెడరేషన్ వ్యవస్థాపక అధ్యక్షులు విబిటి రాజు, గౌరవాధ్యక్షులు టి.రాధాకృష్ణయ్య, టి.ప్రభాకర్‌రావు, ఎంఎస్ రాజు పాల్గొంటారన్నారు. జిల్లాలోని గ్రామీణ వైద్యులు అధిక సంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని వారు కోరారు. గ్రామీణ వైద్యులుగా మారుమూల గ్రామాలలో సైతం ప్రాథమిక చికిత్సలు అందిస్తున్నా గుర్తింపు సమస్య 60 ఏళ్ళుగా సాధించలేకపోతున్నామన్నారు. ప్రభుత్వ ప్రజారోగ్య సంక్షేమ కార్యక్రమాలను విజయవంతం చేయటంలో గ్రామీణ వైద్యులు భాగం పంచుకున్నారన్నారు. గత ప్రభుత్వాలు 465 జీవో ద్వారా శిక్షణ ఇవ్వటానికి చేసిన ప్రయత్నం సఫలీకృతం కాలేదన్నారు. వృత్తి పరిరక్షణ కోసం సంఘటితంగా కృషి చేసి సమస్యలు పరిష్కరించుకోవటానికి ప్రతి సభ్యులు కార్యక్రమంలో పాల్గొని విజయవంతం చేయాలని వారు కోరారు.

క్రీడాస్ఫూర్తిని పెంపొందించేందుకు కృషి

- క్రీడా నైపుణ్యాన్ని గుర్తించేందుకు 'ఆడుదాం ఆంధ్ర'
- జిల్లా స్థాయి పోటీలను ప్రారంభించిన కలెక్టర్ దినేష్‌కుమార్

ఆటలపోటీలను ప్రారంభిస్తున్న కలెక్టర్ దినేష్‌కుమార్

ప్రజాశక్తి - ఒంగోలు కలెక్టరట్

గ్రామస్థాయి నుండి యువతలో క్రీడా స్ఫూర్తిని పెంపొందించేందుకు, వారిలోని క్రీడా నైపుణ్యాన్ని గుర్తించేందుకు 'ఆడుదాం ఆంధ్ర ' కార్యక్రమానికి రాష్ట్ర ప్రభుత్వం శ్రీకారం చుట్టిందని కలెక్టర్ ఏఎస్ దినేష్ కుమార్ తెలిపారు. బుధవారం ఉదయం ఒంగోలు మిని స్టేడియంలో "ఆడుదాం ఆంధ్ర" జిల్లా స్థాయి క్రీడలను కలెక్టర్ దినేస్ కుమార్ ఒంగోలు నగర మేయర్ గంగాడ సుజాతతో కలసి లాంఛనంగా ప్రారంభించారు. ఈ సంధర్భంగా జిల్లా కలెక్టర్, నగర మేయర్, జాతీయ జెండాను, శాప్ క్రీడా జెండాను, ఆడుదాం ఆంధ్ర జెండాను ఆవిష్కరించారు. క్రీడాకారుల నుండి క్రీడా వందనాన్ని వారు స్వీకరించారు. ఈ సంధర్భంగా కలెక్టర్ శ్రీ మాట్లాడుతూ, గ్రామ స్థాయి నుండి క్రీడల్లో యువతను ప్రోత్సహించి వారిలో క్రీడా స్ఫూర్తిని పెంపొందించే లక్ష్యంతో రాష్ట్ర ప్రభుత్వం ఆడుదాం ఆంధ్ర వంటి వినూత్నమైన కార్యక్రమాన్ని చేపట్టారన్నారు. కార్యక్రమంలో క్రికెట్, వాలీబాల్ , కబడ్డీ, ఖో–ఖో , బ్యాట్మింటన్ వంటి 5 అంశాల్లో బాలికలు, బాలురలకు వేరు వేరుగా గ్రామ స్థాయి నుండి మండల, నియోజక వర్గ, జిల్లా, రాష్ట్ర స్థాయిలో క్రీడలను నిర్వహిస్తుందన్నారు. నియోజక వర్గ స్థాయిలో గెలుపొందిన క్రీడాకారులకు నేటి నుండి జిల్లా స్థాయిలో క్రీడా పోటీలు నిర్వహిస్తున్నామన్నారు. నియోజక వర్గ స్థాయిలో గెలుపొంది జిల్లా స్థాయిలో పాల్గొంటున్న క్రీడాకారులకు ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ అభినందనలు తెలియజేశారు. క్రీడల్లో పాల్గొనే క్రీడా కారులకు ఎలాంటి అసౌకర్యం కలుగకుండా నియోజక వర్గాల వారీగా నోడల అధికారులను ఏర్పాటుచేసి అన్ని చర్యలు తీసుకున్నామన్నారు. జిల్లా స్థాయి క్రీడల్లో పాల్గొనే క్రీడాకారులు గెలుపొందడంతో పాటు రాష్ట్ర స్థాయి క్రీడల్లో మంచి ప్రతిభ కనబరిచి జిల్లాకు మంచి పేరు తీసుకురావాలన్నారు. ఒంగోలు నగర మేయర్ గంగాడ సుజాత మాట్లాడుతూ విద్యార్థులు కేవలం చదువుకే పరిమితం కాకుండా అన్ని రంగాలతో పాటు క్రీడల్లో ప్రతిభను కనుబరిచి మంచి క్రీడాకారులుగా ఎదగాలన్న ఉద్దేశ్యంతో రాష్ట్ర ప్రభుత్వం ఆడుదాం ఆంధ్ర కార్యక్రమాన్ని రూపొందించిందనానరు. నవంబర్ 26వ తేదీ నుంచి జరుగుతున్న గ్రామ/వార్డు, మండల, నియోజక వర్గ స్థాయి క్రీడల్లో గెలుపొంది జిల్లా స్థాయి వరకు రావడం సంతోషకరమన్నారు. యువత ఈ అవకాశాలను సద్వినియోగం చేసుకుని మంచి ప్రతిభ కనబరిచి రాష్ట్ర, జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో జిల్లాకు గుర్తింపు తీసుకురావాలని క్రీడా కారులకు సూచించారు. ఈ సందర్భంగా కలెక్టర్ దినేష్ కుమార్ ను, నగర మేయర్ శ్రీమతి సుజాత ను, జడ్పీ సిఇఓ బి. జాలి రెడ్డి లను జిల్లా క్రీడా ప్రాధికార సంస్థ అధికారులు ఘనంగా సత్కరించారు. అనంతరం కలెక్టర్ దినేష్ కుమార్ వాలీ బాల్ ఆడి జిల్లా స్థాయి క్రీడా పోటీలను ప్రారంభించారు.

కార్యక్రమంలో జిల్లా పరిషత్ సిఈఒ బి.జాలిరెడ్డి, చీఫ్ కోచ్ జి.రాజరాజేశ్వరి, అడుదాం ఆంధ్ర డిస్ట్రిక్ట్ అంబాసిడర్స్ షేక్ ఇమామ్ షా, జి. భక్తి ధవుడు, మనోజ్ సాయి, వివిధ శాఖల అధికారులు, నియోజక వర్గాల కో ఆర్డినేటర్స్, క్రీడాకారులు పాల్గొన్నారు.

విధులపై అవగాహన పెంచుకోండి

అధికారులకు కలెక్టర్ దినేష్‌కుమార్ ఆదేశం

ప్రజాశక్తి-ఒంగోలు కలెక్టరేట్

రానున్న సార్వత్రిక ఎన్నికల ప్రక్రియకు నియమితులైన నోడల్ అధికారులు, వారికి కేటాయించిన విధులపై పూర్తి అవగాన పెంపొందించుకొని అవసరమైన ముందస్తు ఏర్పాట్లను పటిష్టంగా చేపట్టాలని కలెక్టర్ దినేష్ కుమార్ ఆదేశించారు. బుధవారం కలెక్టరేట్‌లోని సమావేశం మందిరంలో ౹మార్, రానున్న సార్వత్రిక ఎన్నికల ప్రక్రియకు సంబంధించి నియమితులైన నోడల్ అధికారులతో ఆయన సమావేశమై, చేపట్టాల్సిన ముందస్తు ఏర్పాట్లపై సమీక్షించి పలు ఆదేశాలు జారీ చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఎన్నికల నిర్వహణకు సంబంధించి మ్యాన్ పవర్ మేనేజ్‌మెంట్, ట్రెనింగ్ మేనేజ్‌మెంట్, మెటీరియల్ మేనేజ్‌మెంట్, ట్రాన్స్‌పోర్ట్ మేనేజ్‌మెంట్ స్వీప్ యాక్టివిటీస్, ఈవిఎం మేనేజ్‌మెంట్, ఎక్స్‌పెండిచర్ మానిటరింగ్, ఎంసిఎంసి, ఎలక్ట్రరోల్స్, ఎన్నికల ప్రక్రియలో భాగంగా నిర్వహించే ముందస్తు విధులకు సంబంధించి నోడల్ అధికారులు పూర్తి బాధ్యతతో పని చేయాలని సూచించారు. ఎన్నికలు సజావుగా జరగాలంటే ఎన్నికల సిబ్బందికి సమర్థంగా శిక్షణ అవసరమని, అందుకు అనుగుణంగా అసెంబ్లీ స్థాయి మాస్టర్ ట్రెనర్ల జాబితాను సిద్ధం చేయాలని కలెక్టర్ సంబంధిత నోడల్ అధికారిని ఆదేశించారు. ఫిబ్రవరి 10వ తేదీ నాటికి జిల్లాలోని అన్నీ పోలింగ్ కేంద్రాలను క్షుణ్ణంగా పరిశీలించి చేపట్టాల్సిన ప్రాథమిక చర్యలపై పూర్తి స్థాయిలో నివేదిక సమర్పించాలని కలెక్టర్ నోడల్ అధికారులను ఆదేశించారు. నోడల్ అధికారులకు కేటాయించిన విధులకు సంబంధించి చేపట్టిన చర్యలపై యాక్షన్ ప్లాన్‌ను సమర్పించాలని జిల్లా కలెక్టర్, నోడల్ అధికారులను ఆదేశించారు. సమావేశంలో జిల్లా రెవెన్యూ అధికారి ఆర్. శ్రీలత, నోడల్ అధికారులు పాల్గొన్నారు.

కొండపి అభివృద్ధికి నిధులివ్వండి

- సీఎంను కోరిన మంత్రి ఆదిమూలపు సురేష్
- రూ.82.90 కోట్ల ప్రతిపాదనలు అందజేత

ప్రజాశక్తి-శింగరాయకొండ

కొండపి నియోజకవర్గంలో పలు అభివద్ధి పనులకు నిధులు మంజూరు చేయాలని రాష్ట్ర పురపాలక పట్టణాభివద్ధి శాఖ మంత్రి, కొండపి నియోజకవర్గ సమన్వయకర్త డాక్టర్ ఆదిమూలపు సురేష్ ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డిని కోరారు. బుధవారం సచివాలయంలో రాష్ట్ర క్యాబినెట్ సమావేశంలో పాల్గొన్న మంత్రి సురేష్ కొండపి నియోజకవర్గంలో అభివద్ధి పనులకు సంబంధించిన ప్రతిపాదనలను సీఎంకు అందజేశారు. ప్రజల వినతి మేరకు ప్రాధా న్యత ఉన్న ఐదు పనులకు సంబంధించి 82 కోట్ల 90 లక్షలు నిధులు కావాలని కోరారు. టంగుటూరు మండలం అనంతవరం నుంచి తేతుపురం రోడ్డు కం బ్రిడ్జి కోసం రూ.2.4 కోట్లు, శింగరాయకొండ పట్టణంలోని ఎన్‌హెచ్ 5 రోడ్డు విస్తరణ, అభివద్ధి కోసం రూ.4కోట్లు, వయా కొండపి ఒంగోలు నం ద్యాల రోడ్డు పనులకు రూ.50 కోట్లు, కొండపి మండలం కె.ఉప్పలపాడు నుంచి జరుగుమల్లి మండలం ఎం.నిడమనూరు కనెక్టివిటీ రోడ్డు కోసం 1కోటి 50 లక్షలు, మర్రిపూడి మండలం చిలంకూరు వద్ద రోడ్డు కం చెక్ డ్యామ్ నిర్మాణం కోసం రూ.25 కోట్లు మంజూరు చేయాలని కోరారు. ఈ పనులకు అవసరమైన నిధుల మంజూరు కోసం సీఎం సానుకూలంగా స్పందించినట్లు మంత్రి సురేష్ తెలిపారు.

సిఎం జగన్‌తో మంత్రి సురేష్